AL - HILAL

# నెలవంక

మాస పత్రిక

Vol 5,Issue: 28 February - 2009

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

وما كان ربك ليهلك القرى بظلم وأهلها مصلحون

## గోలాన్ గుట్టల సాక్షిగా!

## ఈ ఘోరాలకు బాధ్యులెవరు?



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية



الَّذِينَ طَغَوْا فِي الْبِلَادِ ○ فَأَكْثَرُوا فِيهَا الْفَسَادَ ○
فَصَبَّ عَلَيْهِمْ رَبُّكَ سَوْطَ عَذَابٍ ○ إِنَّ رَبَّكَ لَبِالْمِرْصَادِ ○
....(ఒకప్పుడు) వారంతా రాజ్యాలలో చెలరేగిపోయిన వాళ్ళే. అక్కడ వారు సృష్టించిన కల్లోలం అంతా ఇంతా కాదు. ఎట్టకేలకు నీ ప్రభువు వారిపై 'శిక్ష' అనే కొరడాను ఝుళిపించాడు. యదార్థమేమిటంటే నీ ప్రభువు మాటేసి ఉన్నాడు. (దివ్య ఖుర్‌ఆన్ – 89:11-14)

# నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 5, ISSUE: 28
FEBRUARY 2009

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Sk Abdus Salam Omeri
Tahera Begum

DESIGN
Noushad Zainulabdeen

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait

PHONES
Azeezur Rahman
22444117 EXT. 110
Mujahid Khan Omeri
24711141 EXT. 104

FAX
22400057

E-MAIL
nelavanka@ipc-kw.com

WEBSITE
www.ipc-kw.com

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

## ఈ సంచికలో....

గోలాన్ గుట్టల సాక్షిగా ! 2
తస్మాత్ జాగ్రత్త ! 3
పరీక్ష (కవిత) 4
ఈ ఘోరాలకు బాధ్యులెవరు? 6
చేతులు కాలాక ఆకులు 8
పట్టుకుని ప్రయోజనం? 9
మక్కా విజయం 10
సాధన చేయుమురా నరుడా... 11
ధర్మ సందేహాలు 12
ఇస్లాం శిక్షణ 13
సీరత్ క్విజ్ 14
ఏది కరుణామయ పద్ధతి? 15
హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) 16
ఓ మనిషీ... 18
అనురాగ గోపురం 19
రక్త కన్నీరు 20



❖ كلمة العدد ❖ ليغريك الشيطان.... ❖ الابتلاء ❖ من المسئول؟
❖ لا تلقوا بأيديكم إلي التهلكة ❖ فتح مكة ❖ الثبات سر النجاة ❖ الفتاوى شرعية
❖ تربية المهتدين ❖ أسئلة من السيرة ❖ شبهات حول الإسلام
❖ السيد فاطمة بنت محمد ❖ يأيها الإنسان..! ❖ البيت المثالي ❖ هل تتذكروننا !





بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

# గోలాన్ గుట్టల సాక్షిగా!

అమానుషం, రాక్షసత్వం
నరమేధయాగం, నవతరం సంహారం

పాశవిక దాడులు, కిరాతక చర్యలు – ఇలా ఎన్ని పదాలు వాడినా ఇస్రాయీల్ అఘాయిత్యానికి సరిపోవు. 2009 నూతన సంవత్సర కానుకగా పాలస్తీనియన్లపై పడి జియోనిస్టులు ఒకవైపు ఊచకోత కోస్తుంటే సభ్య ప్రపంచం వేడుక చూసింది. ప్రపంచ శాంతికై స్థాపించబడిన ఐక్యరాజ్య సమితి (U.N.O) నిర్లిప్తంగా ఈ వైనాన్ని తిలకించింది. పొరుగున ఉన్న అరబ్బు రాజ్యాలు ఈ సోదర సంహారాన్ని నిర్ద్వంద్వంగా ఖండించలేని నిస్సహాయ స్థితిలో పడిపోయి, దిక్కు తోచక దిక్కులు చూస్తున్నాయి. ప్రస్తుతం వీరు చేయగలిగిందల్లా ఒక్కటే – చేతులెత్తి ఆ పైవాడిని విలపిస్తూ ప్రార్థించటం! ఆహార, వైద్య సహాయంగా విరాళాలు వసూలు చేసి పంపటం!! యు.ఎన్.ఓను బహిష్కరిస్తామని ఒత్తిడి కూడా తేలేకపోతున్నారు.

నేడు 'గాజా'లో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న పరిస్థితి వర్ణనాతీతం. ఆ ప్రాంతమంతా మరు భూమిగా మారిపోతోంది. రోడ్లపై శవాల గుట్టలు పడివున్నాయి. శరీరాల నుంచి వేరైపోయిన పసి పిల్లల తలలు మానవతను వెక్కిరిస్తున్నాయి. ప్రాణం విడిచిన తల్లి చుట్టూ బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉన్న పిల్లల వాలకం మన చేతకానితనాన్ని నిలదీస్తున్నది. గాజాపై దాడి చేసిన ఇస్రాయీల్ కనీసం అక్కడి చిన్న పిల్లలను, మహిళలను కూడా బయటికి వెళ్ళేందుకు అవకాశం ఇవ్వలేదు. తనకు ప్రత్యర్థులైన హమాస్ నాయకులను దండించే సాకుతో గాజాలో చెలరేగిపోయింది. అమాయక పౌరులను క్రిమికీటకాల్లా కాల్చివేసింది. అభిమానధనులైన ఫాలస్తీనా ముద్దు బిడ్డలు తమ తల్లి ఒడిలో చోటు లేక బలవంతంగా చచ్చిపోయారు. చరిత్ర పునరావృతమయింది. ప్రవక్తలు ప్రభవించిన పుణ్య క్షేత్ర భూభాగం వేలాది అస్థిపంజరాలకు ఆలయమైపోయింది.

యూద జాతి ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రమాదకరమైనదని చరిత్ర చెబుతోంది. యూదులెక్కడ ఉన్నా తాము ప్రశాంతంగా ఉండరు, ఇతరులను ప్రశాంతంగా ఉండనివ్వరు. నూట యాభై ఏండ్ల క్రితమే అమెరికా ఈ ప్రమాదాన్ని పసిగట్టి, చాలా తెలివిగా యూదులను దేశం నుంచి తరలించేందుకు పావులు కదిపింది. బెంజమిన్ ఫ్రాంక్లిన్ ప్రతిపాదన మేరకు వాళ్లకొక రాజ్యాన్ని రూపొందించే పథకం మొదలయింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యూదులు జర్మన్ నాజీల చేతుల్లో ఊచకోత కోయబడటంతో అమెరికా పథకానికి మరింత బలం చేకూరింది. అయితే 'ఇస్రాయీల్' అనే మానస పుత్రునికి చోటివ్వటానికి ఏ ఒక్క పాశ్చాత్య దేశం కూడా ముందుకు రాలేదు. పశ్చిమాసియా గుండెల్లో గునపం గుచ్చుతూ (1945 తర్వాత) ఇస్రాయీల్‌ను ఆవిష్కరించి, పాలస్తీనియన్లను వారి స్వదేశంలోనే నిలువనీడలేని పరిస్థితిని సృష్టించారు. మధ్య ప్రాచ్యంలో ఏ ఒక్క రాజ్యం కూడా సైనికంగా, వైజ్ఞానికంగా బలపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు ఇస్రాయీల్‌ను అంచెలంచెలుగా బలోపేతం చేశారు. ఫలితం అందరి ముందున్నది.

ఈ సమస్య కేవలం 'గాజా సమస్య' కాదు – ఇది మొత్తం 'మిడిల్ ఈస్ట్' సమస్య. అంతకన్నా ఇది బైతుల్ ముఖద్దస్‌తో ముడిపడిఉన్న సమస్య. ఇస్రాయీల్ దమన నీతి కొనసాగినంత కాలం మధ్య ప్రాచ్యం శాంతించదు. ఈ జటిల సమస్యపై అరబ్బు రాజ్యాలు ఎవరికివారే యమునాతీరే అన్నట్టు వ్యవహరిస్తే మిగిలేది పరాభవమే. తమ ఈ దుర్భర స్థితికి గల కారణాలను గురించి స్వయంగా పాలస్తీనియన్లు కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అల్ ఫతహ్ – హమాస్ నేతల మధ్య గల కీచులాటలకు అక్కడి ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. దైవ ధర్మాన్ని, దైవ గ్రంథాన్ని వీడి విషయలోలురుగా బ్రతికేవారిని నాయకులుగా చేసుకున్నప్పుడు పరిస్థితి ఎంతగా విషమిస్తుందో వారు గ్రహించాలి.



మొత్తానికి ముస్లిం సముదాయానికి ఇది తీవ్రమైన కుదుపు. ఇస్రాయీల్ దాడులకు ఆహుతి అయిన వేలాది మంది పాలస్తీనియన్లు దైవ మార్గంలో అమరగతినొందిన హోదాను పొందారు. వాస్తవానికి వారు చావలేదు, బ్రతికే ఉన్నారు. అవమానకరమైన బ్రతుకు ఎవరిదంటే ఈ కిరాతకాన్ని ఖండించకుండా తమాషా చూసే వారిదే.

డా. ముస్తఫా సబాయి

# తస్మాత్ జాగ్రత్త!



షైతాన్ నన్ను విచ్చలవిడిగా పాపాలకు పాల్పడేలా పురిగొల్పుతాడని నేను భయపడటం లేదు... కానీ పాపాన్ని విధేయతా ముసుగులో పెట్టి నన్ను మోసగి స్తాడేమోనని భయపడుతున్నాను...

కరుణ, జాలి, పరామర్శ అన్న గాలంతో వాడు నిన్ను ఓ స్త్రీ ఉచ్చులో బిగించవచ్చు... ముందుచూపు అంటూ ఐహిక తళుకు బెళుకుల ఆకర్షణకు లోను చేసి నీలో ఐహిక లాలసను పెంచవచ్చు... దుష్ట శిక్షణ అనే సాకుతో నిన్ను చెడు సావాసానికి ఉసి గొల్పవచ్చు.

దుర్మార్గుల సంస్కరణ నెపంతో నిన్ను కాపట్యరోగానికి గురిచేయవచ్చు.
ప్రత్యర్థిపై పగసాధింపు చర్య ద్వారా మంచిని పెంచటం చెడుని నిర్మూలించడం నుండి నిన్ను దూరం చేయవచ్చు.

సత్యాన్ని సూటిగా చెప్పాలన్న ప్రేలాపనతో నిన్ను జమాఅత్ (సంఘం) నుండి వేరు చేయవచ్చు.

నిన్ను నీవు సంస్కరించుకో, నీ లోపాల్ని సరిదిద్దుకో అన్న పిలుపుతో సమాజ సంస్కరణ నుండి నిన్ను తొలగించవచ్చు.
విధివ్రాతను నమ్ముకుంటే చాలు అన్న వక్ర భాష్యంతో కర్తవ్యం నుండి నిన్ను దూరం చేయువచ్చు. సోమరిగా తయారు చేయవచ్చు.
ప్రార్థనలో లీనమై ఉండాలన్న నెపంతో విద్యావివేకాల సముపార్జన నుండి దూరం చేయవచ్చు.

'పుణ్యాత్ముల అనుసరణ ముఖ్యం' అన్న ప్రేరణతో నిన్ను ప్రవక్త (స) వారి సంప్రదా యాలకు దూరం చేయవచ్చు.

బాధితుల సానుభూతి అన్న నీతితో నీవు అఘాయిత్యాలకు పాల్పడేలా పురి గొల్పవచ్చు.

షైతాన్ నీకు బహిరంగ శత్రువు. ఏ వేషంలో వచ్చినా అతన్ని నీ శత్రువుగానే ఎంచు. అంతేగాని ఏదో మేలు చేస్తాడు అనుకుంటే మాత్రం నీ తండ్రి ఆదం, తల్లి హవ్వాలు మోసపోయినట్లుగా నీవు మోసపోయే ప్రమాదం ఉంది సుమా!

## పరీక్ష

- శాంతి ప్రియ

అలసి సొలసి ఒడ్డుకు చేరేవేళ ఆఖరి అడుగు
జారి సుడిగుండంలో కొట్టుకుపోతున్న దృశ్యం పరీక్షంటే...

ఎంత తనవారైనా అవసరానికొక్కరూ
పనికిరాలేదన్న నిస్సహాయ క్షణం పరీక్షంటే...

ఒకానొక అమాయకపు ఉదయాన మోగే ఫోన్
ఉన్న ఫళాన బతుకుని బద్దలు చేసే భయంకర కబురు పరీక్షంటే...

ఆకాశానికికెగిసే అందమైన ఆశలు
అకస్మాత్తుగా కరుగుతున్న కలలై నేలకొరగటం పరీక్షంటే...

నిలువెత్తు శోకంపై శిలువైనాక క్షణాల్ని
లెక్కిస్తూ బతకాల్సి రావటం పరీక్షంటే...

కళ్ళ ముందు కదిలే కనుపాపల్లా మెరిసే వాళ్ళు
కాగితాలపై అక్షరాలుగా మిగలటం పరీక్షంటే....

జనన పత్రాల్ని సరిచూసుకోవాల్సిన వేళ
మరణ పత్రాల మీద పేరుని మార్చలేకపోవటం పరీక్షంటే....

బతుకెలాగూ శాశ్వతం కాదని తెలుస్తున్నా అన్నదాతలు
ఆకలి దాహాల్తో మరణాన్ని ఎదుర్కోవడం పరీక్షంటే...

ఈదడమంటూ నేర్చాక అంతులేని జీవన సాగరంలో
బ్రతుకు ఛిద్రమౌతున్నా ఈదుతూ ఉండాల్సిందే
అంతు చిక్కే వరకు పరమాత్మ ప్రసన్నత పొందేవరకు!

"భయం, ఆకలి, ధన ప్రాణ, పంట నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పనిసరిగా పరీక్షిస్తాము. అలాంటి (క్లిష్ట) స్థితిలో సహనం వహించి, ఆపద వచ్చినప్పుడు 'ఇన్నా లిల్లాహి వఇన్నా ఇలైహి రాజిఊన్' అని పలికేవారికి వారి ప్రభువు కారుణ్య కటాక్షాలు లభిస్తాయని శుభవార్త విన్పించు. అలాంటివారే సన్మార్గగాములు.

(బఖర : 155-157)



సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ



# చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం?



**నేటి** పేరెంట్స్ ప్రవర్తనపై నవ్వాలో ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి. తమ సంతానం ఐహికంగా గొప్ప హోదాలను పొందాలని, ఆర్థికంగా బిల్‌గేట్స్‌ను మించిపోవాలనీ ఆశిస్తున్నారు. తప్పులేదు. కానీ తమ సంతానం నైతికంగా ఎదగాలనీ, ధార్మికంగా వృద్ధి చెందాలనీ, సత్కార్యాలలో పోటీపడాలనీ, స్వర్గ హోదాలను అధిరోహించాలనీ, జన్నతుల్ ఫిర్‌దౌస్‌ను తమ సొంతం చేసుకోవాలనీ, అక్కడ ప్రియ ప్రవక్త(స) వారి సహచర్యం పొందాలనీ, దైవ దర్శనంతో పునీతులవ్వాలనీ మాత్రం కోరుకోవడం లేదు. ఇది కడు శోచనీయం. ఐహికంగా, ఆర్థికంగా సంతానం ఎంతగా ఎదిగినా పేరెంట్స్ కంటి చలువ కానేరదు. వారి ద్వారా మనశ్శాంతి లభిస్తుందని ఆశించనూ లేము. తమ సంతానం బాగుండాలనీ, వారు గొప్ప ప్రయోజకు లవ్వాలనీ, మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని మొక్కుకునే తల్లిదండ్రులకు తమ పిల్లల పరలోక సాఫల్యం, స్వర్గ ప్రాప్తి కొరకు దుఆ చేసే తీరిక ఎక్కడిది? అసలు తల్లిదండ్రుల కంటి చలువ పరలోక సాఫల్యం అన్న వాస్తవం ఎంత మంది పేరెంట్స్‌కి తెలుసని? పైగా మా పిల్లలు పాడైపోయారు ఒక్కడూ మా ముసలి బ్రతుకు గోడు పట్టించుకోవటం లేదు అని విచారించడం ఒకటి. అసలు మన సంతానాన్ని అలా పెంచింది ఎవరు? ఆనంద నిలయపు ఆ మల్లెల్ని మందారాల్ని ఫలాల్ని చెరపట్టింది ఎవరు? పేరెంట్స్ కారా? తల్లిదండ్రులు కారా?! అవును ఇందులో వారి ప్రమేయమే ఎక్కువగా ఉంది. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "పుట్టే ప్రతి శిశువు ప్రకృతి (సహజ) ధర్మంపైనే జన్మిస్తాడు. కాని తల్లిదండ్రులు ఆ శిశువును యూదుడిగానో, క్రైస్తవునిగానో, మజూసిగా (అగ్ని ఆరాధకులు)నో మార్చివేస్తారు.

మంచి సంతానం కావాలని తాపత్రయపడేవారు భార్యను కలిసిన ప్రతి రాత్రి మొదట 'బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్‌నష్ షైతాన వ జన్నిబిష్ షైతాన మా రజఖ్‌తనా' (అల్లాహ్ పేరుతో, ఓ అల్లాహ్ మమ్మల్ని శాపగ్రస్తుడైన షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు ప్రసాదించే మా సంతానాన్ని కూడా షైతాన్ బారి నుండి కాపాడు). (బుఖారీ) అన్న దుఆ చదవాలని తెలిసినా చదివేవారు ఎంత మంది? సంతానం కలిగాక షైతాన్ బారి నుండి వారి రక్షణ కోసం "ఉయీజుకుమ్ బికలిమాతిల్లాహిత్తామ్మతి మిన్ కుల్లి షైతానివ్ వ హామ్మతిన్ వమిన్ కుల్లి ఐనిల్ లామ్మతి" (నేను మిమ్మల్ని ప్రతి షైతాన్ మరియు విష జంతువుల బారి నుండి అన్ని రకాల చెడు దృష్టి నుండి అల్లాహ్ సంపూర్ణ వచనాల రక్షణలో ఇస్తున్నాను.) అని చదివేవారు ఎందరు? ఏమిటి ఈ దుఆలదేముందంటారా? మీ దృష్టిలో ఈ ప్రార్థనల ప్రాముఖ్యత ఏమి లేదా?? అయితే దైవ ప్రవక్త(స) ఈ ప్రార్థలను తన అనుచరులకు ఎందుకు బోధించినట్టు? తాను స్వయంగా ఎందుకు చదివినట్టు? ఏమిటి, మన తల్లులు విశ్వాసుల మాతల కన్నా గొప్పవారా? మన సంతానం హసన్, హుసైన్‌ల కన్నా ఉత్తములా?



నిజమైన దైవ దాసులు తమకు దేవుడు నేర్పించిన, దైవ ప్రవక్త(స) ప్రబోధించిన దుఆలను చదవడంతోపాటు ఖుర్ఆన్‌లోని ఈ దుఆను సైతం సదా చేస్తూ ఉంటారు. **"రబ్బనా హబ్‌లనా మిన్ అజ్‌వాజినా వ జుర్రియ్యాతినా ఖుర్రత అయునిన్ వజ్‌అల్‌నా లిల్ ముత్తఖీన ఇమామా".** (సూరా ఫుర్ఖాన్ : 74)
(వారు దైవ సన్నిధిలో చేతులు జోడించి) ప్రభూ! మా భార్యా పిల్లల ద్వారా మాకు కంటి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి అని ప్రార్థిస్తారు.)

ఈ దుఆకు భాష్యం చెబుతూ హసన్ బస్రీ (రహ్మ) ఇలా అన్నారు: దేవుడు దాసుడికి సంతానాన్ని ప్రసాదించడంతో పాటు వారి ద్వారా తల్లిదండ్రుల కంటి చలువను అనుగ్రహించడం అనేది గొప్ప వరం. నిజమైన విశ్వాసులు దైవాదేశాలకు కట్టుబడి జీవించే బిడ్డలను, మనవరాళ్ళను, బంధువుల్ని చూసి ఎంతో ఆనందిస్తారు. ఈ విధంగా ఇహపరాల వారికి కంటి చలువ ప్రాప్తమవుతుంది. దీనికి ఇక్రమా (ర) వివరణ ఇస్తూ: "ఈ దుఆ ముఖ్యోద్దేశం అందమైన శరీరాకృతి, సుందరమైన రూపకల్పన గల సంతానం కాదు. దైవాదేశాలకు దైవప్రవక్త (స) వారి సంప్రదాయాలకు తలొగ్గించే సంతానం అన్నమాట" అన్నారు. ఈ లక్ష్యంతోనే ప్రవక్తలందరి పితామహులు అయిన ఇబ్రాహీమ్(అలై) దైవాన్ని "రబ్బీ హబ్‌లీ మినస్సాలిహీన్" (ప్రభూ! నాకొక సద్గుణ సంపన్నుడైన కుమారుడ్ని ప్రసాదించు) అని ప్రార్థించారు. మేమతనికి సహనశీలుడైన ఒక పిల్లవాడు కలుగుతాడని శుభవార్త తెలిపాము (సాఫ్ఫాత్ 100,101)అన్నాడు అల్లాహ్.

ఈ ఆశయంతోనే ప్రవక్త జకరియ్యా 'రబ్బి హబ్‌లీ మిల్లదున్‌క జుర్రియతన్ తయ్యిబహ్. ఇన్నక సమీవుద్దుఆ' (ప్రభూ! నీ వద్ద నుండి నాకు ఉత్తమ సంతానం ప్రసాదించు. నిస్సందేహంగా నీవే నా మొరాలకించేవాడివి) అని వేడుకున్నారు.
ఆ తర్వాత ఏం జరిగింది?

అతనలా ప్రార్థన గదిలో నిలబడి ప్రార్థన చేస్తుండగానే దైవదూతలు వచ్చి అతని పిలిచారు: "ఓ జకరియ్యా! నిశ్చయంగా అల్లాహ్ నీకు యహ్యా పుడతాడన్న శుభవార్త తెలియజేస్తున్నాడు. అతను అల్లాహ్ నుండి వెలువడే ఒక వాణిని ధృవపరుస్తాడు. పైగా అతను నాయకత్వపు లక్షణాలతో భాసిల్లుతూ ఎంతో నిగ్రహ శక్తి గలవాడై ఉంటాడు. దైవ ప్రవక్త అవుతాడు; సజ్జనులలో పరిగణించబడతాడు" అని చెప్పారు వారు. (ఆలి ఇమ్రాన్ : 39)

ఇదే తపనతో హజ్రత్ మర్యం (అలై) గారి తల్లి దైవాన్ని ఇలా వేడుకొంది: "ఇన్నీ ఉయీజుహా బిక వ జుర్రియ్యతహా మినష్ షైతానిర్రజీమ్" (నేనీ పాపకు మర్యం అని పేరు పెట్టాను) ఈమెను ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారిన పడకుండా నీ రక్షణ లో ఇస్తున్నాను) అన్నది ఆమె. (ఆలి ఇమ్రాన్ 36)
ఆ తర్వాత ఏం జరిగింది?

ఆ తర్వాత ఆమె ప్రభువు ఆ అమ్మాయిని సంతోషంగా స్వీకరించి, చక్కగా పెంచి పోషించాడు. కొన్నాళ్ళకు జకరియ్యాను ఆమెకు సంరక్షకునిగా నియమించాడు. జకరియ్యా ఆమె ప్రార్థన గదిలో ప్రవేశించి నప్పుడల్లా అక్కడ ఆహారపదార్థాలు ప్రత్యక్షమై ఉండేవి. అది చూసి "ఓ మర్యమ్! నీకీ ఆహారం ఎక్కడ్నుంచి వస్తోంది?"

అని ఆశ్చర్యపడుతూ అడిగాడు. దానికి ఆమె "అల్లాహ్ దగ్గర్నుంచి వస్తోంది. నిశ్చయంగా అల్లాహ్ తాను కోరిన వారికి ఇతోధికంగా ఆహారం ప్రసాదిస్తాడు" అని సమాధానమిచ్చింది. (ఆలి ఇమ్రాన్ : 37)

చూశారా! ప్రవక్తలు, పుణ్య స్త్రీలు తమ సంతానం ఉత్తమమైన సంతానం కావాలని దీనాతిదీనంగా దైవాన్ని వేడుకుంటుంటే మనం చేస్తున్నదేమిటి? నాకు పుట్టబోయే బిడ్డ ఇంజనీర్ కావాలనీ, డాక్టర్ కావాలనీ, కలెక్టర్ కావాలనీ ఇంకా ఏదేదో అవ్వాలని కోరుకుంటున్నామే గానీ, ధర్మపరాయణుడు, నీతి నిజాయితీపరుడు, ఉత్తమ పౌరుడు మంచి సంతానం కావాలని కోరుకోవటం లేదు. అందుకే మన సంతానం ఇలా తగలడింది. తల్లిదండ్రుల మీద దయలేదు వారికి, డిగ్రీలున్నాయి. వారు మనకే పుట్టారు. కానీ పుట్టి వారు చేసిన ఘనకార్యం ఏమీ లేదు. పుట్టలోని చెదలు పుట్టి గిట్టినట్లే వారు సైతం -------- తల్లిదండ్రుల్ని నానా యాతనలకి, ఇబ్బందులకి గురిచేస్తున్నారు. కారణం కొంత వరకు మనమైతే, కొంత వరకు వారు కూడా.

సంతానం ఎవరికి ప్రియం కాదు? కానీ ఉత్తమ లక్షణాలు, గొప్ప గుణాలు గల సంతానం కావాలని కోరుకునే తల్లిదండ్రులు ఎందరున్నారు? సంతాన లేమి అయితే మంచి వైద్యుడ్ని సంప్రదిస్తాం, పంటలేమి అయితే సూచనలు అనుభవజ్ఞులను కలిసి తీసుకుంటాం.

మన ప్రయోజనాల కోసం ప్రాపంచిక విషయాలపై ఆధారపడే మనం ఎప్పుడైనా లోకకర్త సృష్టికర్త ముందు మన బాధల్ని చెప్పుకోవడానికి ప్రయత్నించామా? మీరు అడగండి నేను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను అని దేవుడు పదేపదే చెబుతుంటే చెవిటోడి ముందు శంఖం ఊదినట్టుంది మన పరిస్థితి.
"ఏమైంది మీకు? అల్లాహ్ ఔన్నత్యాన్ని నమ్మరెందుకు? ఆయనే కదా మిమ్మల్ని వివిధ ఘట్టాలలో రూపొందించినవాడు. ఆయనే ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలు సృష్టించాడు. అందులో చంద్రుడ్ని (చల్లటి వెన్నెల్ని వెదజల్లే) జ్యోతిలా చేశాడు. సూర్యుడ్ని దేదీప్యమానంగా (ప్రకాశించే) దీపంగా సృజించాడు. ఇదంతా మీకు కన్పించడం లేదా? (నూహ్ :13-16)



# ఈ ఘోరాలకు బాధ్యులెవరు?

ముహమ్మద్ హనీఫ్

మాతృమూర్తికి అత్యున్నత గౌరవం ప్రసాదించబడే మన భారత దేశంలో స్త్రీలపై, అమ్మాయిలపై అఘాయిత్యాలు, వేధింపులు పెరిగి పోతున్నాయి. ముఖ్యంగా కాలేజీ అమ్మాయిలపై దౌర్జన్యాలు, శారీరక దాడులు కూడా జరుగుతూ ఉన్నాయి. కొన్నేళ్ళ క్రితం శ్రీ లక్ష్మి అనే విద్యార్థిని మనోహర్ అనే యువకుని ప్రేమను తిరస్కరించిందనే నెపంతో పట్టపగలు తరగతి గదిలోనే తోటి విద్యార్థుల ఎదుట నిర్దాక్షిణంగా నరికి చంపిన సంఘటన కాని, హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఆయెషా మీరా హత్య కాని, అలాగే ఈ మధ్య వరంగల్ పట్టణంలో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినులపై జరిగిన యాసిడ్ సంఘటన కాని - ప్రదేశాలు ప్రాంతాలు మారాయి తప్ప సంఘటనా కారణాలు, కారకాలు మాత్రం అవే. అమ్మాయిలను ప్రేమ పేరుతో వెంటాడటం, బ్లాక్‌మెయిల్ చేయటం, వ్యవహారం బెడిసికొడితే తట్టుకునే మనో నిబ్బరం లేక పైశాచిక దాడులకు పాల్పడటం పరిపాటి అయిపోయింది. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు సమాజం, మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా స్పందించడం, ఈ సంఘటనలను ఖండిస్తూ నినదించడం, దోషులను శిక్షించాల్సిందిగా కోరడం, తర్వాత వాటిని మరిచిపోవడం లాంఛనంగా జరిగిపోతున్నాయేగాని వీటికి గల కారణాలను అన్వేషించి, వాటికి తగిన పరిష్కారాలను సూచించడం, అలాగే వాటిని అమలు పర్చడంలో సహకరించడం మాత్రం అంతంత మాత్రమే లేదా శూన్యం అని కూడా చెప్పవచ్చు.



నేటి బాలలే రేపటి యువతరం. యువతీ యువకుల మధ్య పరస్పర ఆకర్షణలు సహజము. కాని అవి పెడత్రోవ పట్టకుండా ఉత్తమ సభ్యతా సంస్కారాలు, మంచి నడవడికలు నేర్పవలసిన బాధ్యత మొట్ట మొదట కుటుంబంలో తల్లిదండ్రులపై ఉంటుంది. విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులు కూడా ఎదిగే పిల్లల ఉత్తమ గుణగణాలు, మంచి లక్షణాలు పెంపొందించేందుకు తమ వంతు ధార్మిక నైతిక విలువలను బోధించాలి. అలాగే తల్లిదండ్రులు, గురువులు ఉత్తమమైన ఉదాత్తమైన ఆదర్శనీయ లక్షణాలు కలిగి విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలవాలి. ఈ అదర్శవంతమైన లక్షణాలను పుణికిపుచ్చుకునేందుకు, ఆచరించేందుకు అనువైన వాతావరణం కూడా సమాజం కల్పించాలి.

అలాగే సమాజాన్ని - ముఖ్యంగా యువతరాన్ని - అతిగా ప్రభావితం చేసే సినిమాలు, ఎలక్ట్రానిక్ మీడియా కూడా సామాజిక బాధ్యతను విస్మరించి కేవలం లాభాపేక్షతో, కార్పోరేట్ సంస్కృతిని, ప్రతి విషయాన్ని సంచలనాత్మకం చేయడం ద్వారా తమ టి.ఆర్.పి. రేటుని పెంచు కోవడానికి ప్రయత్నిస్తున్నాయి. మన సంస్కృతిలో భాగం కాని యువతీ యువకుల డాన్స్ ప్రోగ్రాములు, లేట్‌నైట్ పార్టీలు పబ్ కల్చర్‌లకు అతిగా ప్రచారం కల్పించి వీటి ద్వారా యువతీ యువకుల మధ్య ఉండే సహజ ఆకర్షణలను ప్రమాదకరమైన పెడత్రోవ పట్టించేందుకు మార్గం సుగమం చేయడం జరుగుతూ ఉంది. సినిమాలలో, టీ.వీ షోలలో, సీరియల్స్‌లో అశ్లీల అసభ్యకర సన్నివేశాలను, నేరప్రవృత్తిని పెంచే సంఘటనలను ప్రసారం చేయడం ద్వారా యువత క్షణికావేశాలకు, కామోద్రేకాలకు లోనయ్యే అవకాశాలే ఎక్కువ. అలాగే ఫ్యాషన్ షోల పేరుతో అర్ధనగ్న ప్రదర్శనలు, ముప్పాతిక నగ్న దుస్తులు ఎదుటివారిలో సెక్స్ కోరికలు రెచ్చగొట్టే విధంగా కవ్వింపులు కూడా అమ్మాయిలపై అఘాయి త్యాలకు కారణభూతమవుతున్నాయి. అందంగా అలంకరించుకోవడం, దేవుడు ప్రసాదించిన అందానికి మెరుగులు దిద్ది ఆకర్షణీయంగా కనబడటంలో తప్పు లేదేమో కానీ, అది గనక హద్దు మీరితే ప్రమా దాలను ఆహ్వానిస్తుందని తెలుసుకోక పోవడం శోచనీయం.

ఇక్కడ స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయికను నిరసించిన, ఒకవేళ స్త్రీలు బయటికి పర పురుషుల సమక్షంలో తిరుగాడే అవసరమైతే పరదా పద్ధతిని పాటించవలసిందిగా పురమాయించిన ఇస్లామీయ పద్ధతి స్త్రీలకు రక్షణ కల్పిస్తుందని ముస్లిం సమాజాల్లో రుజువైంది. ఈ పరదా పద్ధతి ఇతర సమాజాల్లో కూడా స్త్రీలకు రక్షణ



ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కల్పించవలసిన ప్రథమ కర్తవ్యం గల ప్రభుత్వాలు సంఘటనలు జరిగిన తర్వాత షరా మామూలుగా చర్యలు తీసుకోవడం, అక్కడితో తమ బాధ్యత తీరిపోయినట్లుగా చేతులు దులుపుకోవటం కూడా ఇలాంటి నేరాలు అధికం కావడానికి దోహద పడుతుంది. మన సంస్కృతిలో మాన మర్యాదలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇది కుటుంబ గౌరవంతో ముడిపడివున్న విషయం. అందుకే మాన రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యజించిన ధీర వనితల వైనాలు మన చరిత్రలో కోకొల్లలు. మానభంగానికి గురైన వనిత జీవితాంతం మూల్యం చెల్లించవలసి వస్తుంది. అనునిత్యం మానసిక క్షోభకు గురి కాబడుతూ ఉంటుంది. కనుక మాన రక్షణ కొరకు సమగ్రమైన చట్టాలను చేసి, వాటిని అతిక్రమించిన వారికి కఠినమైన, ఇతరులకు కనువిప్పు కలిగే శిక్షలు విధించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. నేర పరిశోధనలో ఆలస్యం, తీర్పులివ్వటంలో తాత్సారం జరగటం వల్ల తీరని నష్టం జరుగుతోంది.

బాధితులకు సత్వర న్యాయం చేకూరాలి. వీలైతే ఆర్థిక పరిహారం కూడా ఇప్పించాలి. వీటన్నింటికి మించి దోషులలో మానసిక పరివర్తన కలిగేలా ధార్మిక శిక్షణ, సామాజిక విలువలపై గౌరవం పెంపొందేలా ఇతరులకు కనువిప్పు కలిగేలా శిక్షలుంటే ఇటువంటి హేయమైన చేష్టలు బాగా తగ్గు ముఖం పడతాయి. అలాగే సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్త్రీలు, మీడియా ప్రభుత్వం అందరూ తమ సామాజిక బాధ్యతలు గర్తించి మసలుకున్నప్పుడే సమాజంలో స్త్రీలపై అఘాయిత్యాలను ఆపగలము.



# తిలా పాపం తలా పిడికెడు !

- చేదు విత్తనాలను నాటి తీపి ఫలాలను ఆరగించాలనుకోవటం సమంజసమా?

- కాలేజీ క్యాంపస్‌లో తమ పిల్లలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని తల్లిదండ్రులు ఒకవైపు డిమాండు చేస్తూనే, ఈ కాలేజీలు అరాచకానికి ఆలయమవుతున్నాయని మరో వైపు గగ్గోలు చెందటం శుద్ధ అవివేకం కాదా?

- దోషులను శిక్షించే చట్టాలు, న్యాయస్థానాలుండగా పోలీసులు హడావిడిగా నిందితులపై ఎన్‌కౌంటర్ జరిపి ఫైల్ క్లోజ్ చేయడం దేన్ని సూచిస్తుంది?

- సినిమాలలో మితిమీరిన అశ్లీలాన్ని, హింసా ప్రవృత్తిని, విశృంఖలత్వాన్ని జొప్పించే సినీ ప్రముఖులకు యువతలో సభ్యతాసంస్కారాలు క్షీణిస్తున్నాయని వాపోయే నైతిక హక్కు ఎక్కడుంది?

- రచయితలు, సంఘ సంస్కర్తలు ఒకవైపు యువతీయువకుల విచ్చలవిడి కలయికను ప్రోత్సహిస్తూనే, మరో వైపు మన సామాజిక వ్యవస్థను తూలనాడటం ఎంత వరకు సహేతుకం?

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్

సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

# మక్కా విజయం
## (హిజ్రీ శకం- 8)

హుదైబియాలో కుదిరిన సంధి రెండు సంవత్సరాల పాటు ముస్లింలకు - ఖురైషీ లకు మధ్య కొనసాగింది. అయితే కొన్నాళ్ళ తర్వాత ఖురైషులు సంధి షరతుల్లోని ఓ షరతుని ఉల్లంఘించారు. తత్కారణంగా దైవ ప్రవక్త (స) హిజ్రీ శకం 8వ సంవత్సరంలో పది వేల మంది అనుచరులతో మదీనా నుండి బయలుదేరారు. మక్కా బైట ఇంత పెద్ద సైన్యాన్ని చూసిన ఖురైషీలు కొయ్యబారి పోయారు. సైనికులంతా రాత్రి సమయంలో అగ్ని మంటలు రాజేయవలసిందిగా ప్రవక్త (స) ఆదేశించారు. ఖురైషులు మళ్ళీ సంధి కుదుర్చుకోవాలన్న ఉద్దేశంతో అబూ సుఫ్యాన్‌ను పంపించారు. దైవ ప్రవక్త (స) అతన్ని ఇస్లాం వైపు ఆహ్వానించారు. ఆయన ఇస్లాం స్వీకరించారు. మరుసటి రోజు ఉదయం ప్రవక్త (స) మక్కాలో ప్రవేశించారు. (అనివార్యమైతే తప్ప) ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించకూడదని ఆయన (స) ముస్లిములకి హితవు చేశారు. ఆ తర్వాత ముస్లింలను ఉద్దేశించి మరి కొన్ని ఆదేశాలు జారీ అయ్యాయి.

1) తన ఇంటిలో ద్వారాలు మూసుకుని ఉండే వ్యక్తికి మన్నింపు ఇవ్వబడుతుంది.

2) మస్జిదె హరామ్‌లో ప్రవేశించిన వ్యక్తి సురక్షితుడు.

3) అబూ సుఫ్యాన్ ఇంట్లో ప్రవేశించిన వ్యక్తి సురక్షితుడు.

ఇది ప్రవక్త (స) అబూ సుఫ్యాన్‌కు గౌరవార్థం ఆదేశించారు. ఆ తర్వాత ప్రవక్త (స) మస్జిదె హరామ్‌లో ప్రవేశించారు. "అల్లాహు అక్బర్" అని బిగ్గరగా తక్బీర్ చెప్పారు. అల్లాహ్‌ను కీర్తిస్తూ ఇలా అన్నారు: "అన్ని విధాల పొగడ్తలు ఒక్క అల్లాహ్‌కు మాత్రమే చెందు. ఆయన తానిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. ఆయన తన దాసునికి సహాయం చేశాడు. తానొక్కడే ఇతర మూకాలన్నింటిని ఓడించాడు". ఆ తర్వాత కాబా గృహ ప్రదక్షిణ చేశారు. అప్పుడు కాబా చుట్టూ 360 విగ్రహాలున్నాయి. మహా ప్రవక్త (స) తన సహచరులతో కలసి "సత్యం వచ్చేసింది, అసత్యం నిష్క్రమించింది; అసత్యం ఎప్పటికైనా నిష్క్రమించేదే" అన్న దైవ సూక్తిని పఠిస్తూ విగ్రహాలను తొలగించారు.



## గజ్వయె హునైన్
### (హునైన్ పోరాటం హిజ్రీ శకం 8)

మక్కా విజయం తర్వాత రెండు తెగల్ని మినహాయించి మిగతా వారంతా ఇస్లాం గొప్పతనాన్ని అంగీకరించారు. ఆ రెండు తెగల్లో ఒకటి హవాజిన్, రెండవది సఖీఫ్. వారు ముస్లింలకు లొంగకపోవడమే కాక వారికి వ్యతిరేకంగా యుద్ధ సన్నాహాలు చేయసాగారు. ఈ రెండు తెగలు మక్కా తాయిఫ్‌ల మధ్య నివసించేవి. వాళ్ళు ఓ పెద్ద సైన్యాన్ని సిద్ధపరిచారు. తమతో పాటు మేకల్ని, పశువుల్ని, స్త్రీలని కూడా వెంట బెట్టుకుని మక్కాకు బయలుదేరి, హునైన్ లోయలో మోహరించారు. వారందరి కమాండర్ వారి అశ్వ దళాన్ని, విలుకాండ్రను వేరు వేరు పరచి ఆ లోయలోని రహస్య స్థావరాల్లో మాటువేసి ఉండమని, ముస్లింలు ఈ ఇరుకైన లోయగుండా ప్రవేశించగానే వారిపై ఒక్కసారిగా బాణాల వర్షం కురిపించి, మెరుపు దాడి చెయ్యండి అని ఆదేశించాడు.

ఇటు దైవప్రవక్త (స) కూడా 12 వేల మంది ముస్లిం సిపాయిలతో మక్కా నుండి బయలు దేరారు. వారిలో పది వేల మంది పూర్వం మక్కా విజయంలో పాల్గొన్నవారు. మిగతా రెండు వేల మంది మక్కా వాసులు.

వారిలోని అత్యధికశాతం మంది కొత్తగా ఇస్లాం స్వీకరించినవారే. ఇక్కడ ముస్లింలు తమ సంఖ్యా బలాన్ని చూసుకుని కాస్తంత గర్వానికి లోనయ్యారు. ప్రవక్త (స) సైన్యం లోయలో ప్రవేశించిన మరుక్షణమే సైనికుల్లో కలకలం మొదలయ్యింది. పంక్తులు చిందరవందరయ్యాయి. ముందు భాగంలో జెండా పట్టుకుని ఉన్నవారు కూడా నిల ద్రొక్కుకోకలేక పరుగెత్తారు. ముస్లింలు ఆ లోయలో ఎటుపడితే అటు దిక్కు తోచక పరుగెత్తసాగారు. ఇరుకైన లోయలో శత్రువుల బాణాలతో చేసే దాడికి ముస్లింలు దిగ్భ్రాంతి చెందారు.

ఆ తర్వాత ఏం జరిగింది?

# సాధన చేయుమురా నరుడా సాధ్యము కానిది లేదురా





- అబూ తఫ్‌హీమ్
mujq8@yahoo.co.in

తౌసీఫ్, తస్నీమ్ ఇద్దరూ మంచి ప్రొగ్రామర్లు. అల్‌టెక్ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో జేరారు. తమ టీమ్ మేనేజర్ వీరిద్దరికి ఒక అంశమిచ్చి 'దీనిని పరిష్కరించండి, చాలా రోజుల నుంచి ఇది పెండింగ్‌లో ఉంది. సీనియర్స్ కూడా చేయలేకపోయారు. మీరు ప్రయత్నించి చూడండి' అన్నాడు.

తస్నీమ్ కొన్ని గంటలు ప్రయత్నించినా ఫలించలేదు. సీనియర్సే సాధించలేని పనిని నేనెక్కడ సాధించగలనని, అయినా ఇది చేయకపోతే ఉద్యోగం ఊడిపోదు కదా అనుకుని ఆ ప్రయత్నాన్ని ఆపివేశాడు.

తౌసీఫ్ దీనిని ఒక మంచి ఆపర్చునిటీ (సదవకాశం) గా భావించాడు. ఎంత కష్టమైనా సాధించాలని ఛాలెంజీగా తీసుకున్నాడు. సీనియర్స్ చేయలేకపోతే ఇక ఈ పెండింగ్ ఇలా పడి ఉండాల్సిందేనా, నేను ఎందుకు పరిష్కరించకూడదు అని మొదలుపెట్టి రాత్రింబవళ్ళు కష్టపడి మొత్తానికి సాధించాడు. కంపెనీ మీటింగ్‌లో స్టాఫ్ అందరి ముందు దీనిని ప్రజెంట్ చేసాడు. అందరూ తప్పట్ల వర్షం కురిపించారు. సీనియర్స్ అందరూ వచ్చి భుజాన్ని తట్టుతూ ప్రోత్సహించారు. ఆ కంపెనీ బాస్ దృష్టిలో తౌసీఫ్ ఒక మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు. కొన్ని రోజుల్లోనే ఒక క్రొత్త బ్రాంచ్‌కు మేనేజర్‌గా వెళ్ళాడు. తస్నీమ్ ఒక సాధారణ ఉద్యోగిలాగే అక్కడ మిగిలిపోయాడు.

తౌసీఫ్ లాంటి ఉద్యోగులు కంపెనీలకు, సంస్థలకు ప్రగతికి కారణమవుతే తస్నీమ్ లాంటి ఉద్యోగులు భారంగా మిగిలిపోతున్నారు. నెలనెలా జీతం పుచ్చుకోవడం, కామ్ చలావ్ పనులు చేసుకుంటూ ఉద్యోగాన్ని కాపాడుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంటారు.

కువైట్‌లో మన తెలుగు సోదరులు 40 శాతం మంది డ్రైవర్లుగా సేల్స్‌మన్‌లుగా చిన్నచిన్న ఉద్యోగాల్లో ఉన్నారు. దాదాపు ఎక్కువ మంది తమ ఉద్యోగం పట్ల అయోమయం, అనాసక్తతతో ఉంటారు. అదేమంటే పనలేని కారణాలు చూపిస్తారు. నిజానికి అది తస్నీమ్ లాంటి స్వభావం. తౌసీఫ్ లాగా భయపడకుండా, కష్టపడి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సత్తా నిరూపించుకోవాలి. కష్టపడేవారి వెనుక అల్లాహ్ సహకారం తప్పక ఉంటుంది.

జీవితంలో సాధన అనేది ఎంతో ముఖ్యం. ఈ సాధన- కష్టం, సమయం, పట్టుదలను కోరుతుంది. వెయ్యి మందిలో ఒక్కడే సాధిస్తాడు. ఎందుకంటే సాధించాలి అనే పట్టుదల, ప్రయత్నం ఉంటుంది కాబట్టి. మిగతా 999 మంది ప్రయత్నిస్తారు కాని పట్టుదల ఉండదు. సహసం అసలు ఉండదు.

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలో తాయిఫ్ సంఘటన అన్నింటికన్నా బాధాకరమైన విషయం. ధర్మ ప్రచారానికై తాయెఫ్ వెళితే వాళ్ళు రాళ్ళతో కొట్టి కొట్టి కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) ను రక్తంలో ముంచేసారు. స్పృహ తప్పి పడిపోతే, నీళ్ళు కొట్టి మళ్ళీ లేపారు. లేపి మరలా కొట్టడం మొదలెట్టారు.

ఈ సంఘటనను ఊహిస్తేనే మనిషి భయంతో అల్లాడిపోతాడు. కాని ప్రవక్త (స) భయపడలేదు. ఈ ప్రయత్నాన్ని మానుకోలేదు. "ఈ భూమిపై శాంతిని స్థాపించాల"నే సాధనాన్ని అసలు వదలదలుచుకోలేదు.

విశేషం ఏమిటంటే, ఈ తాయిఫ్ సంఘటన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు, ప్రయత్నాలు క్రితంకన్నా ఎన్నో రెట్లు పెరిగిపోయాయి.

ప్రవక్త ముహమ్మద్ (స)కు విజయం దక్కిందంటే అది తాయెఫ్ మరియు హిజ్రత్ మధ్య కాలంలో చేపట్టిన ప్రయత్నాలే కారణమని చెప్పాలి.

తాయెఫ్ సంఘటన తర్వాత ప్రవక్త (స) నిరుత్సాహపడలేదు. అదే ఉత్సాహంతో తమ ప్రయత్నంలో పూర్తిగా నిమగ్నులయిపోయారు. లక్ష్యం ఉన్నతమైతే మనిషి నిరుత్సాహ పడడు? అల్లాహ్ తప్పక సహకారం అందిస్తాడనే నమ్మకం ఉండాలి.

సాధన, పట్టుదల మంచి విషయాల్లో ఉండాలి. అంతేకాని శత్రుత్వం, ఇతరులను కించపర్చడంలో, కూపీలు లాగటంలో, వారిని నష్టపర్చడంలో మన శక్తి సామర్థ్యాలను వ్యర్థం చేసుకోకూడదు. దానివల్ల సాధించేది తక్కువ మన నష్టమే ఎక్కువ ఉంటుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్ర ఉన్నతమైన ఆదర్శం. తాయెఫ్ వారిని ప్రవక్త ముహమ్మద్ (స) క్షమించడం మాత్రమే కాదు, దయ కరుణ కూడా చూపారు. మంచి లక్ష్యంతో ఎదురయ్యే చెడును, శత్రుత్వాన్ని మంచితో తొలగించారు మహా ప్రవక్త ముహమ్మద్ (స). అందుకే దివ్య ఖుర్‌ఆన్ ఇలా బోధించింది:

"మంచి - చెడు రెండూ సమానం కావు. (ఓ ప్రవక్తా!) నీవు చెడును మంచి ద్వారా తొలగించు. ఆ తర్వాత నీ బద్ధ శత్రువే నీకు స్నేహితుడవటం నీవు చూస్తావు".

(దివ్య ఖుర్‌ఆన్- 41:34)



# IPC ఆధ్వర్యంలో ఈదుల్ అజ్హా ప్రార్థనలు



ఇస్లాం ప్రెజెంటేషన్ కమిటీ (IPC) తెలుగు విభాగం ఆధ్వర్యంలో 08-12-08 వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు స్థానిక ఖైతాన్ పార్కులో 'ఈదుల్ అజ్హా' ప్రార్థనలు జరిగాయి. IPC తెలుగు దాయి మౌలానా షేఖ్ అబ్దుస్సలాం ఉమ్రీ పండుగ నమాజుకు సారథ్యం వహించగా, నెలవంక సంపాదకులు ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ ఖుత్బా ఇచ్చారు. అనంతరం IPC తెలుగు దాయి మౌలానా సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ తెలుగులో ప్రసంగించారు. 300 మంది స్త్రీలు, పురుషులు, బాలలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో 50 మంది న్యూ ముస్లిం సోదర సోదరీమణులు ఈ శుభ ఘడియలను ఆస్వాదించారు.

అనంతరం IPC తెలుగు దాయి మౌలానా ముజాహిద్ ఖాన్ ఉమ్రీ సారథ్యంలో సాంస్కృతిక, క్రీడా పోటీలు జరిగాయి. IPC తెలుగు దాయిలు సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ గారు, షేఖ్ ముహమ్మద్ బిలాల్ గారు ఆద్యంతం ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అదే సమయంలో IPC మహిళా విభాగం దాయియాలు మహిళా సాంస్కృతిక ప్రోగ్రాములను నిర్వహించారు. చివర్లో విజేతలకు బహుమతులు ఇవ్వబడ్డాయి. ఈ కార్యక్రమం విజయవంతం కావటంలో తమ వంతు తోడ్పాటునందించిన వారందరికీ IPC తెలుగు విభాగం కృతజ్ఞతలు తెలుపుతోంది.

# ధర్మ సందేహాలు

## మొబైల్ ఫోన్లో సంగీత వాయిద్యాలు

**సందేహం: మొబైల్ ఫోన్లలో మ్యూజికల్ ట్యూన్స్‌పై మీ అభిప్రాయం ఏమిటి? ఈ సంగీత వాయిద్యాలు చివరకు మస్జిదులలో, ప్రార్థనల్లో కూడా మ్రోగుతున్నాయి. ప్రార్థనల్లో ఏకాగ్రత దెబ్బతింటోంది కదా!**

**సమాధానం:** మొబైల్ ఫోన్లలో సంగీత వాయిద్యాలు, పాటలు లోడ్ చేయటం అధర్మం (హరామ్). పై పెచ్చు అటువంటి వాయిద్యాలు మస్జిదులలో వినవస్తే అది మరింత తీవ్రమైన, జుగుప్సాకరమైన వ్యవహారం అవుతుంది. ఎందుకంటే దైవనామస్మరణ జరిగే పవిత్ర స్థలాలలో అపసవ్యతను, రోతను పుట్టించే వికృత చేష్ట అది! కాబట్టి అటువంటి ఏహ్యాకరమైన చేష్టకు పాల్పడేవాడు ఎక్కువ పాపాత్ముడు అవుతాడు.

మస్జిదులు అల్లాహ్ ఆరాధనకై ప్రత్యేకించబడినవి. కాబట్టి ఆ పవిత్ర స్థలాలలో అల్లాహ్‌నే మొరపెట్టుకోవాలి. వేరితరులను మొరపెట్టుకోవటంగానీ, వేరితర గాత్రం అక్కడ వినిపించటం గానీ ఎంతకీ తగదు. అలాంటి వెకిలిచేష్టలకు పాల్పడేవారు తమ కర్మల రికార్డులో నమోదవుతున్న దుష్కర్మను గురించి ఆలోచించాలి.

ఒకవేళ ఈ సెల్ ఫోన్లు సమంజసమైన సౌండ్‌లో మ్రోగేవైనాసరే మస్జిదులలో మ్రోగనివ్వటం భావ్యంకాదు. ప్రార్థనా స్థలాల్లో వాటిని సైలెంట్‌లోనయినా పెట్టాలి. లేదంటే స్విచ్‌నయినా ఆఫ్ చేసుకోవాలి.

**(షేఖ్ ముహమ్మద్ సాలెహ్ అల్‌ముంజిద్)**

## దైవ వాక్యాలు గల పేపర్లను చిత్తుపేపర్లుగా వాడటం

**సందేహం: భోజన సమయంలో దస్తర్‌ఖాన్ మాదిరిగా అల్లాహ్ పేర్లు లేదా ఖుర్‌ఆన్ వాక్యాలు ముద్రించబడి ఉన్న పేపర్లను పరచుకుని భోజనం చేయవచ్చునా?**

**సమాధానం:** ఒకవేళ ఆ పేపర్లపై అల్లాహ్ పేరుగానీ, దైవ వాక్యాలు గానీ వ్రాసి ఉంటే, అట్టి పేపర్లను భోజన స్థలంలో పరచుకుని, వాటిపై కూర్చోవటం, పాత్రలు పెట్టడం ధర్మ సమ్మతం కాదు. అలాగే ఆ పేపర్లను వస్తుసామగ్రి నిమిత్తం పొట్లాలుగా తయారు చేయటం, వాటిని అవమానకరమైన రీతిలో వాడుకోవటం కూడా ధర్మసమ్మతం కాదు. అలాంటి పరిస్థితి ఎదురైనపుడు ఆ పేపర్లను సముచితమైనచోట భద్రపరచాలి. లేదా వాటిని కాల్చివేయాలి. అదీ కాదనుకుంటే వాటిని పరిశుభ్రమైన స్థలంలో పూడ్చి పెట్టాలి.

**(షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ - రహ్మ.లై)**

## వాయిదాల పద్ధతిపై క్రయవిక్రయాలు

**సందేహం: వాయిదాల ప్రాతిపదిక** (Installment basis) **పై కార్లు, తదితర వాహనాలు విక్రయించబడుతుంటాయి. ఇటువంటి అమ్మకాల్లో ధరలు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు నగదు ఇచ్చి కొన్నప్పుడు వాహనం ఖరీదు 15 వేలు ఉంటే, కిస్తులవారీ పద్ధతిపై అంతకన్నా ఎక్కువ ధర ఉంటుంది. ఇలాంటి అమ్మకాలు 'వడ్డీ' క్రిందకు రావా?**

**సమాధానం:** అమ్మకం సమయంలో కిస్తుల సంఖ్యతో పాటు గడువు కూడా నిర్ధారించబడినట్లయితే అటువంటి క్రయ విక్రయాలు ఆక్షేపణీయం కావు- కిస్తుల ప్రాతిపదికపై ధర ఎక్కువ ఉన్నా సరే! ఎందుకంటే కొనేవాడు, అమ్మేవాడు -ఇద్దరూ ఈ పద్ధతి ద్వారా లబ్ధిపొందుతున్నారు. అమ్మకం దారునికి అధిక ధర లభిస్తుంది. కొనుగోలు దారునికి చాలినంత గడువు (వెసులు బాటు) లభిస్తుంది. హజ్రత్ బరీరా(ర) అనే సహాబియా (సేవకురాలు) ను ఆమె యజమానులు తొమ్మిదేండ్ల వాయిదాల పద్ధతిపై విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర) కు అమ్మటం జరిగింది. ఏటేటా 40 దిర్హములు చొప్పు చెల్లించాలని షరతు విధించబడింది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే వాయిదాల పద్ధతిపై వస్తువుల క్రయ విక్రయాలు ధర్మ సమ్మతమే. అదీగాక ఈ వర్తకంలో మోసంగానీ, అస్పష్టత గానీ ఏమీ లేవు. కాబట్టి ఇతరత్రా కొనుగోలు - అమ్మకాలవలె ఇది కూడా ధర్మ సమ్మతమే. కాకపోతే వస్తువును అమ్మే సమయంలో ఆ వస్తువు అమ్మకం దారుని ప్రాపర్టీగా ఉండాలి.

**(షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ - రహ్మ.లై)**

## నమాజు స్థితిలో టిష్యూ పేపర్ల వాడకం


**సందేహం: నమాజు చేస్తుండగా ఒక వ్యక్తికి దగ్గు వచ్చి, నోట్లోకి వచ్చిన తెమడా (కఫం) ఊయవలసివస్తుంది. అట్టి సమయంలో అతను టిష్యూ పేపర్‌ని ఉపయోగించవచ్చునా?**

**సమాధానం:** నమాజు చేస్తున్నపుడు ఎవరికయినా దగ్గు వచ్చి, కఫం విసర్జించినపుడు టిష్యూ పేపర్‌గానీ, రుమాలు గానీ - జేబులో నుండి తీసి-ఉపయోగించటం అభ్యంతరకరం ఏమీకాదు. సహీహ్ ముస్లింలోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ అబూ హురైరా(ర) ఇలా తెలిపారు: మస్జిద్‌లోని ఖిబ్లా దిశలో ఎవరో ఉమ్మివేసి ఉండగా ప్రవక్త(స) గమనించారు. ఆయన (స) జనులనుద్దేశించి, "మీలోని ఒక వ్యక్తికి ఏమైపోయింది, అతను తన ప్రభువు ఎదుట నిలబడి కూడా, తన నోట్లోని తెమడాను తీసి బయటపడవేస్తున్నాడు? మీలో ఎవరి ముఖంపైనయినా ఉమ్మివేస్తే దాన్ని వారు సహిస్తారా? మీలో ఎవరికయినా (నమాజు స్థితిలో) దగ్గు వచ్చి, ఉమ్మి వేయవలసి వస్తే తన కాలి క్రిందవేయాలి. లేదంటే ఈ విధంగా చేయాలి (అంటూ ఆయన తన చేతి రుమాలుపై ఉమ్మి వేసి, ఆ గుడ్డను నలిపారు)

**(షేఖ్ ముహమ్మద్ సాలెహ్ అల్‌ముంజిద్)**



హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్




# వుజూ వివరణ

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఏ వ్యక్తి అయినా వుజూ చేసిన తరువాత ఈ క్రింది 'దుఆ' పఠిస్తే అతని కోసం స్వర్గానికున్న ఎనిమిది ద్వారాలు తెరువబడతాయి. అతను తాను కోరిన ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. (ముస్లిం)

### వుజూ తర్వాత చేసే దుఆ

అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీకలహూ వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ, అల్లాహుమ్మజ్ అల్నీ మినత్తవ్వాబీన వజ్అల్నీ మినల్ ముతతహ్హిరీన్. (ముస్లిం,తిర్మిజీ)

(అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని ఆయన ఒక్కడేననీ, ఆయనకు సాటి రాగలవారెవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్(స) దేవుని దాసులు మరియు దైవప్రవక్త అని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను. దేవా! నన్ను పశ్చాత్తాపం చెందేవానిగా, పరిశుభ్రతను పాటించేవానిగా చెయ్యి.)

### వుజూను భంగపరిచే విషయాలు

వుజూ నాలుగు విషయాల వల్ల భంగమవుతుంది.

1. మలమూత్ర మార్గాల గుండా ఏదయినా వస్తువు విసర్జింపబడటం. (బుఖారీ)
2. మత్తు లేక అపస్మారక స్థితికి లోనవటం, గాఢ నిద్ర. (అబూదావూద్)
3. వస్త్రం అడ్డం లేకుండా మర్మాంగాన్ని ముట్టుకోవటం. (తిర్మిజి)
4. ఒంటె మాంసం తినటం వల్ల. (ముస్లిం)

గమనిక: ఏ కారణాల మూలంగానయితే గుసుల్ భంగమవుతుందో వాటి మూలంగా వుజూ కూడా భంగమవుతుంది. ఉదా: సంభోగం, బహిష్టు స్రావం మొదలగునవి.

### వుజూకు సంబంధించిన ఆదేశాలు

1. ఒక వుజూతో ఎన్ని నమాజులైనా చేసుకోవచ్చు. (ముస్లిం)
2. కడగవలసిన అవయవాల్లో గోరంత భాగం పొడిగా ఉన్నా మళ్ళీ సరిక్రొత్తగా వుజూ చేయవలసి ఉంటుంది. (ముస్లిం)
3. వుజూలో అవసరానికి మించి నీళ్ళు వాడకూడదు. (అహ్మద్)
4. జిగటగా ఉండే పదార్థాలు తిన్నప్పుడు లేదా త్రాగినపుడు
5. వుజూలో నోటిని నీళ్ళతో పుక్కిలించాలి. (బుఖారీ-ముస్లిం)
6. గోళ్ళకు రంగు వేసుకొని వుజూ చేస్తే ఆ వుజూ నెరవేరదు. (తిర్మిజీ)

# తయమ్ముమ్ వివరణ

'తయమ్ముమ్' అంటే సంకల్పించటం అని అర్థం. షరీఅత్ పరిభాషలో తయమ్ముమ్ అంటే ప్రయాణంలో ఉన్నప్పుడుగాని స్థానికంగా గాని, వుజూ గుసుల్లో మాదిరి పరిశుద్ధతను పొందే ఉద్దేశంతో, రెండు చేతుల్ని మట్టిపై కొట్టి ముఖాన్నీ, చేతులనూ స్పర్శించుకోవటం అని అర్థం. తయమ్ముమ్ గురించి దేవుడు ఇలా అంటున్నాడు:"మీరు ఎప్పుడైనా అస్వస్థులైతే లేక ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసి వుంటే లేక మీరు మీ స్త్రీలను తాకి వుంటే (వారితో సంభోగించి ఉంటే), మీకు నీరు లభ్యంకాని పక్షంలో, పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి, దానితో మీ ముఖాలను, చేతుల్ని స్పర్శించుకోండి." (ఖుర్ఆన్ 4:43) తయమ్ముమ్ వుజూ మరియు గుసుల్ రెండింటికీ ప్రత్యామ్నాయం కాగలదు.

### తయమ్ముమ్ అనుమతించబడే పరిస్థితులు

1. అసలు నీళ్ళు ఎక్కడా లభ్యం కానప్పుడు తయమ్ముమ్ చేయటానికి అనుమతించబడుతుంది. (బుఖారీ-ముస్లిం)

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: పది సంవత్సరాల దాకా నీళ్ళు లభ్యం కాకపోయినా మనిషి కొరకు పరిశుభ్రమైన మట్టి- అతని వుజూ, గుసుళ్ళకు ప్రత్యామ్నాయం కాగలదు. (అబూదావూద్, తిర్మిజీ)

2. వ్యాధిగ్రస్తునికి తన వ్యాధి తీవ్రమవుతుందేమోనన్న భయం ఉన్నప్పుడు. (అబూదావూద్, ఇబ్నెమాజా)
3. నీళ్ళు ఉపయోగించటం వల్ల ఏదయినా నష్టం జరుగుతుందేమోనన్న భయం ఉన్నప్పుడు. అంటే నీరు చాలా చల్లగా ఉండి దాంతో వుజూగాని లేక గుసుల్గాని చేస్తే, వ్యాధికి గురయ్యే ప్రమాదముందనుకుంటే, ఆ సమయంలో తయమ్ముమ్ చేసుకోవచ్చు.

(అబూదావూద్, ఇబ్నెమాజా)

4. నీరు సమీపంలో ఉన్నా, దాన్ని తీసుకురావటానికి వెళితే ధన మాన ప్రాణ నష్టం కలుగుతుందన్న భయముంటే లేదా బావి నుండి తోడుకునే సాధనమేదీ లభించనప్పుడు తయమ్ముమ్ చేసుకోవటం ధర్మ సమ్మతం అవుతుంది.
5. తమ దగ్గర నీరు చాలా తక్కువగా ఉండి దాన్ని వుజూ గుసుల్ కోసం ఉపయోగించుకుంటే, తర్వాత ఏదైనా తినటానికి గాని ఇతర అవసరాలకు గాని నీరు లభించదన్న భయమున్నప్పుడు తయమ్ముమ్ చేసుకోవచ్చు.



### ఏ వస్తువుతో తయమ్ముమ్ చేయవచ్చు?

"మీరు పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసుకోండి" (ఖుర్ఆన్ 5:6)

పై సూక్తిలో (అరబీలో) 'సయీద్' అనే పదం వాడబడింది. సయీద్ అంటే భూమి ఉపరితల భాగం. అది మట్టి అయినా కావచ్చు లేదా మట్టిలాంటి ఇతర వస్తువులేవయినా కావచ్చు.

### తయమ్ముమ్ చేసుకునే పద్ధతి

1. పరిశుద్ధతను పొందే ఉద్దేశ్యంతో 'బిస్మిల్లాహ్' అని పలకాలి.
2. రెండు చేతుల్నీ పరిశుభ్రమైన మట్టి మీద కొట్టాలి.
3. చేతుల్ని ఒకసారి ఊదుకొని ముఖం మీద స్పర్శించుకోవాలి.
4. తర్వాత చేతుల్ని మణికట్ల వరకు రుద్దుకోవాలి.
5. చివర్లో వుజూ చేసిన తర్వాత పఠించే ప్రార్థన వాక్యాలే తయమ్ముమ్ తర్వాత కూడా పఠించాలి. (బుఖారీ-ముస్లిం)

### తయమ్ముమ్‌ని భంగపరిచే విషయాలు

ఏ కారణాలవల్ల వుజూ భంగమవుతుందో వాటివల్ల తయమ్ముమ్ కూడా భంగమవుతుంది. (అబూదావూద్, నసాయి)

వ్యాధి లేక ఏదైనా అనివార్య కారణం వల్ల తయమ్ముమ్ చేసి వుంటే, ఆ పరిస్థితి తొలగిపోగానే తయమ్ముమ్ భంగమవుతుంది. నీరు దొరకని కారణంగా తయమ్ముమ్ చేసి ఉంటే ఆ తరువాత నీటిని చూడగానే తయమ్ముమ్ భంగమవుతుంది.

## సీరత్ క్విజ్



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

**▶ ఇస్లాం స్వీకరించిన బిలాల్ (ర) పరిస్థితి ఏమైంది?**

జ: బిలాల్(ర) ఉమయ్యా బిన్ ఖల్ఫ్ దగ్గర బానిస. ఉమయ్యా ఆయన మెడలో త్రాడు వేసి మక్కా కొండల మధ్య ఈడుస్తూ తిరగండని అల్లరి మూకలకు అప్పగించేవాడు. మండే ఎడారి ఇసుకపై పడవేసి బరువైన బండను రొమ్ముపై పెట్టి, ఇస్లాం త్యజించమనీ లేకపోతే ఇలాగే చావవలసి ఉంటుందని చెప్పి, "దైవసాక్షి! నీవు ఇలాగే పడి వుంటావు, చివరికి నీ ప్రాణం పోతుంది. ముహమ్మద్(స) ను తిరస్కరించి బ్రతికిపోతావు" అని చెప్పేవారు. బిలాల్(ర) ఆ పరిస్థితిలో కూడా "అహద్, అహద్" (ఒక్కడే (దేవుడు) ఒక్కడే) అని పలికేవారు. ఓ రోజు ఇలాంటి సంఘటనే జరుగుతూ ఉండగా అటు నుంచి అబూబక్ర్ సిద్దీఖ్(ర) వెళుతూ చూసారు. ఆయన బిలాల్(ర) ను కొని బానిసత్వం నుండి విముక్తినిచ్చారు.

**▶ హింసా దౌర్జన్యాల ఈ పరంపర ఎప్పటి నుంచి మొదలైంది?**

జ: హింసా దౌర్జన్యాల ఈ పరంపర దైవ దౌత్యపు నాలుగవ సంవత్సరంలో ఆరంభమైంది.

**▶ ఇలాంటి గడ్డు పరిస్థితులలో ఏ సూరా అవతరించింది?**

జ: రెండు సూరాలు అవతరించాయి.

**(1)సూరా కహఫ్:** ఇది అసలు బహుదైవారాధకులు వేసిన ప్రశ్నలకు సమాధానం. కాని ఈ సురాలో మూడు సంఘటనలు వివరించబడ్డాయి. వీటిలో అల్లాహ్ తరఫు నుండి తన దాసుల భవిష్యత్తు గురించి సాంత్వన వచనాలు ఉన్నాయి. కాబట్టి అస్హాబె కహఫ్ (గుహ వారు) సంఘటనలో ధర్మానికి, విశ్వాసానికి ప్రమాదం ఏర్పడినప్పుడు దైవధిక్కార, దౌర్జన్య కేంద్రాల నుండి హిజ్రత్ చేసి అల్లాహ్‌పై భారం వేస్తూ బయటకు వెళ్ళిపోవాలనే సంకేతం కూడా ఉంది.

**(2)సూరా జుమర్:** అందులో హిజ్రత్ వైపునకు సంకేతం ఉంది. అల్లాహ్ సృష్టించిన ఈ లోకం ఇరుకైనది ఎంత మాత్రం కాదని చెప్పడం జరిగింది. ముఖ్యంగా 10 వ ఆయతులో "(ఓ ప్రవక్తా! ఇలా చెప్పు) విశ్వసించిన నా దాసులారా! మీ ప్రభువునకు భయపడండి. ఈ లోకంలో సద్వర్తనను అవలంబించే వారికి మేలు జరుగుతుంది. దేవుని భూమి విశాలమైనటువంటిది. ఓర్పు వహించేవారికి లెక్కలేనంత ప్రతిఫలం ఇవ్వబడుతుంది." అనబడింది.

**▶ ముస్లిములు అబిసీనియా ఎప్పుడు వలసపోయారు?**

జ: దైవ దౌత్య శకం అయిదవ సంవత్సరం.

**▶ ముస్లిములు అబిసీనియాకు వలసపోవటానికి గల కారణం?**

జ: అవిశ్వాసులు, దైవవిరోధులు పెట్టున్న బాధల, ఉపద్రవాల నుండి తమ ధర్మాన్ని రంక్షించుకునేందుకు అబిసీనియాకు వలసపోవాలని దైవప్రవక్త(స) ఆదేశమిచ్చారు.

డా.బద్దేరి
(ప్రొద్దుటూరు)



# ఏది కరుణామయ పద్ధతి?

**ముస్లిములన్నా, ఇస్లాం అన్నా గిట్టని వారు ముఖ్యంగా పనీ పాటా లేని పలెటూరి వారు కొన్ని లకోటా ప్రశ్నలతో ముస్లిములను వ్యథకు గురిచేస్తుంటారు. అట్టి వారి ప్రశ్నల్లో ఒకటి ఇది:**

**ప్రశ్న:** ముస్లిములు 'బిస్మిల్లాహ్ ' చేసిన మాంసము మాత్రమే తింటారు. ఎందుకు? ఎలాగూ జంతువుగానీ, పక్షిగానీ చచ్చిపోయాకే కదా వండుకు తినేది?



**జవాబు:** ఈ ప్రశ్నకు సమాధానం వివరంగా చెప్తేగానీ అందులోని పరమార్థం అర్థం కాదు. పశువైద్య కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులకు ఒక సుప్రసిద్ధ ప్రశ్న దాదాపు ప్రతి సంవత్సరం అడగబడ్తూ వుంది. ఆ అంశపు ప్రాధాన్యత అలాంటిది మరి. అదేంటంటే... **What is Slaughter? Name the various types of slaughters? Which is the Human and best method. Discuss why?** (పశు వధంటే ఏమిటి?దాన్ని ఎన్ని విధాలుగా వధించవచ్చు? అందులో కరుణామయ పద్ధతి ఏది? ఎందువలననో వివరింపుము) ఈ ప్రశ్నకు క్లుప్తంగా జవాబు ఇది: "ఒక జీవి ప్రాణం తీసి దాన్ని నిర్జీవం చేయటాన్ని పశువధ(**Slaughter**) అంటారు. పశువుల్ని అనేక విధాలుగా చంపవచ్చు.

**(1)** నీటిలో ముంచి. **(2)** మెడ నరికి

**(3)** ములికి లేదా పదునైన అంబు లేదా ఈటె పరికరంతో పొడిచి.

**(4)** తుపాకీ గుండుతో.

**(5)** పదునైన ఆయుధంతో.

**(6)** ఒక గాలి వీచని గదిలో మందను తోస్తే ఆక్సిజన్ లభించకుండా చేసి.

**(7)** విషయువాయువు గదిలో పంపి.

**(8)** విషాహారం తినిపించి.

**(9)** విషం ఇంజక్షనుగా యిచ్చి.

**(10)** బలవంతంగా లేక పీక నొక్కి

**(11)** ఊపిరాడకుండా ముక్కు, నోరు మూసి పట్టి.

**(12)** గొంతు కోసి

**(13)** కరెంటు షాకు ఇచ్చి.

**(14)** హలాల్ పద్ధతిననుసరించి మొదలగు పద్ధతులననుసరించి పశువుల్ని లేక పక్షుల్ని చంపవచ్చు.

వీటిలో **Halal Method** (బిస్మిల్లాహ్ పద్ధతి) అన్నింటికన్నా ఉత్తమమైనది. మరియు "కరుణామయ పద్ధతి" అని పశువైద్య శాస్త్రం నేర్పే '**Meat Hygine**' అనే గ్రంథంలో వ్రాయబడి వుంది. ఎగ్జామ్స్‌లో డిగ్రీ విద్యార్థికి అడగబడిన పై ప్రశ్నకు ఇంత వరకు జవాబిస్తే పదికి రెండు మార్కులు మాత్రమే వస్తాయి. ఆ తరువాత "ఎందువల్లనో వివరింపుము"? అనే ప్రశ్నకు జవాబు వ్రాస్తే తతిమా 8 మార్కులు ఇవ్వ బడతాయి. ఎందుకంటే హలాల్ పద్ధతిలో ముస్లిములు జిబహ్ చేయాల్సిన పశువు లేక జంతువు సామర్థ్యం (**storage capacity**) పెరుగుతుంది. ఈ పద్ధతిలో పశువు లేక పక్షి యొక్క ప్రధాన సిరలైన (**jugular veins**) (దో షాహి రగే) అన్న వాహిక, శ్వాస నాళము (మొత్తం నాలుగు) తెగాలనే నియమముంది. శరీరంలో బృహద్ధమని (**Aorta**) తరువాత పెద్ద రక్తనాళాలు ఈ పుపుసశిరలే. ఇవి గొంతు వద్ద చర్మానికి (క్రింద) సమీపంలోకి వున్నాయి.

హలాల్ పద్ధతిలో అవి తెగుతాయి కనుక శరీరంలోని రక్తం సత్వరంగా, సంపూర్ణంగా వెలుపలికి చిందింపబడ్తుంది. అన్న వాహిక, శ్వాసనాళం కూడా తెగిన కారణంగా పశువు వెంటనే స్పృహ తప్పుతుంది. కనుక దానికి బాధ అనిపించదు. అందువల్లనే 'బిస్మిల్లాహ్' లేక కరుణామయ పద్ధతి (హలాల్ పద్ధతి) **"Halal Method of Slaughter is the human Method"** అనిపించుకుంటుంది. అంతే కాదు, స్పృహలేక కాళ్ళు చేతులు కొట్టు కోవటం వల్ల ఒంటిలోని కణజాలంలోని రక్తమంతా బయటికి పంపు చేయబడ్తుంది. అంటే; మాంసం రక్తరహితమౌతుంది.

ఇలా రక్తరహిత మాంసం తినటం వల్ల రక్తంతో పాటు యూరిక్ ఆసిడ్ కూడా చిందింపబడుతుంది. కనుక కందరాల నొప్పులురావు. ఇతర రోగాలు సంక్రమించటం అరుదు అవుతుంది. రోగకారక సూక్ష్మజీవులు రక్తంలోనే కదా ఎక్కువగా జీవించి వుండేది. రక్తప్రవాహంతో పాటు అవి కూడా వెలుపలికి చిందింపబడ్తాయి. కనుక హలాల్ పద్ధతి శ్రేష్ఠమైనది' అని వ్రాసే ప్రతి విద్యార్థికీ పూర్తి మార్కులు ఇవ్వబడతాయి.

తాహెరా బేగం

# హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) - 6

## సంతాన శిక్షణ

హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) తమ పిల్లల శిక్షణ కూడా తన పితామహుని (స) శైలిలోనే చేయసాగారు. అల్లాహ్‌ను ప్రసన్నుణ్ణి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పిల్లల ముందు "అల్లాహ్‌యే మన ప్రభువు, ఆయన అనంత కరుణామయుడు, ఆయన కోపాగ్ని చాలా భయంకరమైంది, ఆయనీపనికిష్టపడడు, ఆ పని అయిష్టం" అని అల్లాహ్ గుణగణాలను, ఇష్టాయిష్టాలను తెలియపరచేవారు. పిల్లలయందు అల్లాహ్ పట్ల ప్రేమ భయాలు జనింపజేసేవారు. వారి ఆలోచనలు, చర్యలు అదే దిశలో నడిచేలా చేసేవారు.

ఒకసారి నాల్గయిదు సంవత్సరాల చిన్నారి హసన్ హుసైన్‌లిరువురూ ఏదో విషయంపై పోట్లాడుకుని హసన్ నాకు కొట్టాడంటే హుసైన్ నాక్కొట్టాడంటూ తల్లి వద్ద ఫిర్యాదు తీసుకొచ్చారు. తల్లి వారిద్దరి వాదన విన్న తరువాత ఇలా తీర్మానించారు: "హసన్ హుసైన్‌కు కొట్టాడో, హుసైన్ హసన్‌కు కొట్టాడో నేనెరుగును. కానీ నాకు తెలిసిందల్లా అల్లాహ్ తగువులాడేవారిని ఇష్టపడడన్నదే, మీరిద్దరు జగడమాడి అల్లాహ్‌ను అసంతోషపరచారు. కాబట్టి మీరిద్దరూ నా నుంచి దూరం జరగండి. ఎవరైతే అల్లాహ్‌ను అసంతోష పరచారో వారితో నేను కూడా అసంతృప్తి చెందాను" అని తల్లి వారిని తమనుంచి దూరం చేసారు. ఈ మాటలు విన్న పిల్లలు వారి పోట్లాట మాని తమ ప్రియ తల్లి కోపాన్ని, ఎడబాటును (అది కాసేపటికైనా) సరే భరించలేక ఆమెను ప్రాధేయపడసాగారు. తల్లి ఓరచూపుల్తో వారిని చూడసాగారు. కాని పైకి మాత్రం తమ కోపాన్ని, అలాగే ప్రదర్శించారు. వారిద్దరు గారాబంగా తల్లి దగ్గరకు వచ్చి 'అమ్మా! మా తప్పును అల్లాహ్‌చే మన్నింపచేయండి' అని ప్రాధేయపడ్డారు. తాము మరెప్పుడూ పోట్లాడుకోమని లెంపలేసుకున్నారు. ఇది



చూసిన తల్లి వారి మన్నింపుకై ఉన్న దుఆలను (ప్రార్థనలను) నేర్పించసాగారు. ఒక వైపు వారిద్దరూ ఉత్తమమైన విధేయులు, మరొకవైపు మంచి సోదరులు. సత్యం పలకడం, ఎదుటి వారి గౌరవ మర్యాదలను కాపాడటం వారి స్వభావం. ఆ తరువాత వారిరువురు ప్రపంచానికి ఉదాహరణ ప్రాయంగా నిలిచారు. అయితే ఆ సోదరులిద్దరిలో సుగుణాలను నూరి పోసిన ఘనత హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)దే.

## తండ్రి మరణం:

ప్రపంచంలోని ప్రతి వస్తువు అశాశ్వతమైనది. ఈ ప్రపంచంలో వచ్చిన ప్రతి ప్రాణికి మరణమనేది తప్పదు. ఎన్ని సంవత్సరాలు, ఎన్ని కాలాలపాటు జీవించినా మరణమనేది అవశక్యం. ప్రవక్త ముహమ్మద్(స) తమ 63 సంవత్సరాల వ్యవధిని పూర్తి చేసుకుని పరలోకానికి పయనించారు. వారు అంతిమ ప్రవక్త, సమస్త మానవ జాతికి ఉత్తమ శిక్షకులు, అనురాగాలొలకించే తండ్రి శాశ్వతంగా దూరమయ్యారు. హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) గారికి అది మామూలు విషాదం కాదు.

ప్రవక్త (స) అంతిమ క్షణాల్లో తీవ్ర జ్వరంతో బాధ పడుతూ స్పృహ కోల్పోతున్న, కోల్కుంటున్న ఆ దృశ్యం హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) హృదయాన్ని దుఃఖ సాగరంలో ముంచేసింది. భరించలేక 'ఓ నాన్నా' అని కేక వేశారు, ఆ కేక విన్న ప్రవక్త ముహమ్మద్ (స) ఆమెను దగ్గరగా పిలిచి, చెవిలో ఏదో చెప్పారు. అది విన్న హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) ఏడ్వసాగారు. ప్రవక్త(స) ఆమెను మరలా పిలిచి చెవిలో ఏదో చెప్పగా ఆమె నవ్వారు. ఇది చూసిన వారిలో కుతూహలం రేగింది. కానీ ఎవ్వరూ వారినడగ సాహసించలేదు- ఆయిషా(ర) తప్ప.

హజ్రత్ ఆయిషా(ర), హజ్రత్ ఫాతిమా (ర.అన్హా)తో ఉన్న చనువుతో ఇంతకీ ఆ రహస్యమేమిటోనని అడిగారు. కాని హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) నిరాకరించారు. ఆయిషా(ర) ప్రవక్త(స) మరణానంతరం మరలా ఆ రహస్యాన్ని చెప్పమని బలవంతపర్చారు. అప్పుడు హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) ఇలా తెలియజేసారు: నేనీ అనారోగ్యంలో మరణిస్తానని నాన్న గారు చెప్పగా నేనేడ్వసాగాను. రెండోసారి 'నా కుటుంబీకులందరిలో మొట్టమొదట నన్ను కలుసుకునే దానివి నీవే' నన్న శుభవార్తకు నేను నవ్వాను."

తండ్రి మరణాన్ని ఆమె తట్టుకోలేక పోయారు. దుఃఖ స్థితిలో ఛాతి బాదుకోవడం, దుస్తులు చించుకోవడం, జుట్టు లాక్కోవడంలాంటి పనులను ముహమ్మద్(స) తీవ్రంగా ఖండించారు. కాబట్టి ఆమె తమ బాధనెప్పుడూ ఎవ్వరి ఎదుటా వ్యక్త పరచలేదు. తమ దుఃఖాన్ని దిగమ్రింగుకున్నారు. కాని ఆ తరువాత ఎవ్వరూ ఎప్పుడూ ఆమె పెదాలపై చిరునవ్వు కూడా చూడలేదు.

ప్రవక్త(స) గారి అంత్యక్రియల తరువాత అనస్(ర)ను చూసి హజ్రత్ ఫాతిమా (ర.అన్హా) "ప్రవక్త(స) (సమాధి) పై మీరు మట్టిలా వేయగలిగారు?" అనే హృదయ విదారకర వాక్యం వారి పెదాల ద్వారా వెలువడిందని బుఖారీ తెలియపరచారు. దుఃఖంలో గుండెలు తరుక్కుపోతున్నా హద్దులు మీరి ప్రవర్తించలేదు. తమ బాధను బయటకు రానివ్వలేదు.

రిపోర్టింగ్: షేఖ్ నజీబుద్దీన్ ఖాన్



# న్యూ ముస్లింలు నిలువెల్లా కరిగిపోయిన వేళ...




## 27-11-08 (గురువారం)

దైవకృపవల్ల ఇస్లాం ప్రెజెంటేషన్ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు దేశాలకు చెందిన 130 మంది నవముస్లిం సోదర సోదరీమణులు అర్కానుల్ ఇస్లాంలోని ఒక విధ్యుక్త ధర్మమైన హజ్జ్ విధిని నిర్వర్తించటం కోసం మూడు బస్సుల్లో కువైట్ నుండి బయలుదేరారు. వీరిలో భారతీయులు, శ్రీలంకన్లు, ఫిలిప్పీనీలు, చైనీయులు ఉన్నారు. ఒక్క తెలుగు వారే 40 మంది వరకూ ఉన్నారు. IPC హజ్జ్ వ్యవహారాల మేనేజర్ షేఖ్ మునీఫ్ అల్ అజీమీ తగు సూచనలతో ఈ పయన బృందానికి వీడ్కోలు పలికారు. ఈ పయన బృందానికి డా. నాసిర్ అల్ కందరీ 'అమీర్'గా ఉన్నారు.

## 28-11-08 (శుక్రవారం)

ఉదయం 6 గంటలకు సౌదీ అరేబీయా సరిహద్దులో ఇమిగ్రేషన్ లాంఛనాలన్నీ పూర్తి చేసుకుని ముందుకు సాగిపోయాము.

## 29-11-08 (శనివారం)

ఉదయం 8:30 గంటలకు తాయిఫ్ నగరం దాటాము. మీఖాత్ స్థలమైన 'ఖర్నుల్ మనాజిల్' లో ఆగి, స్నానాదులు చేసి ఉమ్రాదీక్ష బూనాము. అక్కడి నుంచి 'తల్బియా'పఠిస్తూ మధ్యాహ్నం 12:30 గంటలకు పవిత్ర మక్కా నగరం చేరుకున్నాము. కాబా గృహాన్ని సందర్శించి, ఉమ్రా క్రియలు నెరవేర్చాము.

## 29-11-08 నుండి 05-12-08 వరకు

మక్కాలో మా బస కోసం ప్రత్యేకించబడిన భవనంలో విశ్రాంతి తీసుకున్నాము. ఈ వారం రోజుల్లో మా కార్యక్రమం-

- ప్రతి రోజూ కాబా గృహం వద్దకు వచ్చి ప్రార్థనలు చేసేవారం.
- హిరా గుహ (జబ్లె నూర్) ను సందర్శించాము. యువ కెరటాలైన మా తెలుగు న్యూ ముస్లిం సోదరులు కొండపైకెక్కి హిరా గుహను కూడా చూసి వచ్చారు.
- హజ్జ్ కాలంలో గడపవలసిన ముఖ్య ప్రదేశాలైన అరఫాత్, మినా, ముజ్దలిఫా, జబ్లె రహ్మా, మస్జిదె నిమ్రాలను ముందస్తుగానే సందర్శించి వచ్చాము.
- ఈ వ్యవధిలో మా హజ్జ్ యాత్రికుల మధ్య సాంస్కృతిక పోటీలు కూడా జరిగాయి.
- కువైట్‌లోని వక్ఫ్ మంత్రిత్వ శాఖ తరఫున ప్రఖ్యాత విద్వాంసులు మౌలానా బద్రుల్ హసన్ ఖాస్మి గారు మాకు 'ముఅల్లిమ్'గా వచ్చారు. ఆయన తరచు మమ్మల్ని ఉద్దేశ్యించి ప్రసంగించేవారు. మాలో ధార్మిక చైతన్యాన్ని మేల్కొలిపేవారు.
- 05-12-08 వ తేదీన IPC అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షేఖ్ జమాల్ షత్తీ మా క్యాంపును సందర్శించి మా హజ్జ్ బృందంలో దైవభక్తిని, దైవభీతిని నూరి పోశారు.









## 06-12-08 (శనివారం)

అందరం హజ్జ్ సంకల్పం చేసుకుని 'మినా' స్థలానికి బయలుదేరాము. మరుసటి రోజు ఉదయం వరకు అక్కడే బస చేశాము. ఈ వ్యవధిలో నమాజులు, దైవధ్యానం, దుఆలు చేశాము. షేఖ్ బదర్ ఖాస్మిగారు 'మినాలో విడిది ప్రాముఖ్యత' గురించి క్షుణ్ణంగా వివరించారు.

## 08-12-08 నుండి 10-12-08

**(సోమ, మంగళ, బుధవారాలు)**

వరుసగా మూడురోజులు 'మినా' ప్రదేశానికి వచ్చి 'రమీ' చేశాము. ఈ లోగా మా హమ్లా (ప్రయాణం) పర్యవేక్షకులు మా హజ్జ్ సోదరుల తరఫున ఇవ్వవలసిన ఖుర్బానీ బాధ్యతను నెరవేర్చారు. 10-12-08వ తేదీన కాబా గృహాన్ని సందర్శించి వీడ్కోలు ప్రదక్షిణ చేసి అదే రోజు రాత్రి మదీనాకు పయనమయ్యాము.

## 11-12-08 (గురువారం)

ఉదయం 9:30 గంటలకు మదీనా నగరంలోనికి ప్రవేశించాము. మస్జిదె నబవీలో తాదాత్మ్యం చెందుతూ దుఆలు చేశాము. అక్కడి చారిత్రక స్థలాలను తిలకించాము.

## 12-12-08 (శుక్రవారం)

మధ్యాహ్నం 2 గంటలకల్లా క్షేమంగా, సురక్షితంగా కువైట్ చేరుకున్నాము. IPC అహ్మదీ బ్రాంచి కార్యకర్తలు మాకు ఆప్యాయతతో స్వాగతం పలికారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా హాజీలను వారి వారి

మంతఖాలకు చేరవేశారు. ఈ అపురూప స్వాగత సత్కారాలకు మా న్యూ ముస్లిం సోదర సోదరీమణులు అమితంగా ప్రభావితులయ్యారు. వారి హావభావాలను చూసినపుడు, వారి మనోరథం ఈడేరిన ఆ శుభఘడియను తిలకించినపుడు దివ్యఖుర్ఆన్‌లోని ఈ వచనం మదిలో తప్పక మెదలుతుంది.

"ఇన్నల్లజీన ఆమనూ వ అమిలుస్సాలిహాతి సయజ్ అలు లహుముర్రహ్మాను వుద్దా."

(మర్యమ్ - 96)

(నిశ్చయంగా ఎవరయితే విశ్వసించి, సదాచరణ చేస్తూ ఉంటారో వారి యెడల కరుణామయుడైన అల్లాహ్ సృష్టితాల హృదయాలలో ప్రేమను సృజిస్తాడు.)

అవును. ఆ ప్రేమ అమూల్యమైనది!

ఆ ఆప్యాయత మరువరానిది!!

ఆ సంఘటన చిరస్మరణీయమైనది!!!

IPC పరిపాలక వర్గానికి నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకుంటూ మేము కూడా మా ఆప్తులతో కలిసి ఖైతాన్ (మా ఇంటికి) బయలుదేరాము.

జి. ఓబుల్ రెడ్డి
(ముహమ్మద్)

# ఓ మనిషీ! మార్గం మరచిపోతున్నావు



విశ్వప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:
విశ్వసించిన ప్రజలారా! షైతాను అడుగు జాడలలో నడవకండి. వాడిని ఎవరైనా అనుసరిస్తే వాడు అతనికి అశ్లీలతనే, చెడునే ఆజ్ఞాపిస్తాడు. (24:21)
షైతాన్ అడుగు జాడల్లో నడిస్తే వాడు మిమ్మల్ని మార్గం తప్పించి నరకం వైపునకు దారి చూపిస్తాడు జాగ్రత్త అని మనిషికి అల్లాహ్ హెచ్చరిక చేస్తున్నాడు.
మానవునికి షైతాన్ ఎలాంటి సమయంలో, ఎలాంటి విషయాలలో చెడును ఆజ్ఞాపిస్తాడో కొన్నింటిని పరిశీలిద్దాం:

1. మనిషి విశ్వానికి దేవుడు ఒక్కడే అని అంటున్నాడు కాని షైతాన్ వలలో పడి బహుదైవారాధనకు పాల్పడుతున్నాడు.

2. భూలోకంలో శాంతికి నిలయాలు మస్జిద్‌లు అని అంటున్నాడు కాని షైతాన్ వలలో పడి మందిరాలను, దర్గాలను దర్శిస్తున్నాడు. ఇహలోకంలో ఉండే మస్జిద్‌లను మర్చిపోతున్నాడు.

3. దేవుని సందేశహరుల (ప్రవక్తలు)ను విశ్వసిస్తున్నాడు కూడా. కాని మానవుడు షైతాన్ వలలో పడి సాధువులను, సన్యాసులను ఆశ్రయిస్తున్నాడు. విశ్వప్రభువు పంపిన ప్రవక్తలను మరచిపోతున్నాడు.

4. రుజుమార్గం చూపేది దైవగ్రంథాలే అని పూర్తి నమ్మకం ఉన్నప్పటికీ షైతాన్ వలలో పడి సురక్షితమైన దైవగ్రంథాలను మరచిపోయి మార్పులు చేర్పులకు గురయిన గ్రంథాలను ఆశ్రయించి రుజుమార్గానికి దూరమైపోతున్నాడు.

5. ఆదేశాలు, సంస్కారాలు ధర్మమని చెబుతూనే షైతాన్ వలలో పడి కుడి ఎడమల అపవాదాలకు లోనవుతున్నాడు. ఆ విధంగా షైతానుకు బానిసయైపోయి దేవుడు పంపించిన జీవిత విధానాన్ని పూర్తిగా మరచిపోయాడు.

6. దైవారాధనే ముక్తికి సోపానం అని అంటూ, షైతాన్ వలలో పడి దైవేతరులకు పూజలు, పురస్కారాలు అర్పితం చేస్తున్నాడు. ఇంకా బీదల హక్కులను (జకాత్) చెల్లించడం లేదు. నమాజ్‌ను కూడా పాటించడం లేదు.

7. పరాయి సొమ్ము పాము లాంటిది అని తెలిసి కూడా షైతాన్ వలలో పడి దొంగతనాలకు, దోపిడీలకు, వ్యభిచారానికి పాల్పడుతున్నాడు. ప్రళయ దినాన్ని (తీర్పుదినాన్ని) మరచిపోయాడు.

8. పుట్టిన మనిషి గిట్టక తప్పదు అని అంటాడు. కాని షైతాన్ వలలో పడి ఆలుబిడ్డలు ఆస్తిపాసులు తన సొంతం అని భ్రమ పడుతున్నాడు. మరణానంతర జీవితాన్ని మరచేపోయాడు.

9. స్వర్గం, నరకం ఉన్నాయి అని విశ్వసించినప్పటికీ షైతాన్ వలలో పడి అంతమైపోయే ఇహలోకాన్నే సర్వస్వంగా భావిస్తూ శాశ్వితమైన స్వర్గాన్ని మరచిపోయాడు.

10. సత్యమేవ జయతే అని పదేపదే చెపుతూ ఉంటాడు. షైతాన్ వలలో పడిపోయి అన్యాయానికి, అక్రమాలకు పాల్పడుతాడు. సత్యాన్ని ధర్మాన్ని మరచిపోయాడు. మనిషికి ఎప్పుడైతే దేవుని మీద విశ్వాసం లేకుండా పోతుందో అలాంటి సమయంలో షైతాన్ మనిషిని మార్గం తప్పించి వాడి మార్గంలోనే నరకం వైపునకు నడిపించుకుంటాడు.
దేవుని మీద విశ్వాసం ఉన్న మనిషిని మార్గం తప్పించడం వాడి వల్ల కాదు.

# ఓ భార్యగా నేను

- ఉమ్మె హసన్



## స్వాగతం

నేను మా శ్రీవారిని పూర్తి ఉత్సాహంతో ఘనంగా స్వాగతిస్తాను. వారు ఎప్పుడు ఎదురైనా నవ్వుతూనే పలకరిస్తాను. నేను వారి రాకకై పరితపిస్తున్నట్లు, ఎదురుచూస్తున్నట్లుగా వారికి అవగతమయ్యేలా ప్రయత్నిస్తాను.

వారు ఇంట్లో ప్రవేశించేటప్పుడు నేను చిరునవ్వుతో వారి అలసటను దూరం చేస్తాను.

ఇంట్లో ప్రవేశించాక దుస్తులు మార్చుకునేంతవరకు, ప్రశాంతంగా కూర్చునేంతవరకు నేను వారితోనే ఉంటాను.

నేను వారి ఆరోగ్యం గురించి అడుగుతాను. వారి దిన చర్యల గురించి ప్రశ్నిస్తాను.

వారికోసం నేను నీళ్ళగ్లాస్ అందజేస్తాను. పళ్ళరసాలు ఎక్కువగా ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.

నా శరీరం నుండి ఎలాంటి దుర్వాసన రాకుండా జాగ్రత్తపడతాను.

## బంధు మిత్రులు

శ్రీవారి బంధువులు- అతిథుల కోసం నేను మెచ్చేది కాక వారు ఇష్టపడే వంటకాలని చేసి పెడతాను.

వారు విశ్రాంతి తీసుకునే గదులను నీటుగా ఉంచుతాను.

నేను వారందరితో ప్రేమతో వాత్సల్యంతో మసలుకుంటాను.

## భర్త కోసం

నేను వారి ముఖ్య కార్యాల్లో తలదూర్చను.ఏదైనా మాటనికాని లేక నా కోరికను గాని మళ్ళీ మళ్ళీ చెప్పి విసిగించను.

- నేను వారిని చాలా మృదువుగా పలకరిస్తాను. నా మాట సరైనదైనా ఆ సమయంలో నన్ను నేను అదుపులో ఉంచుకుంటాను మంచి సమయం చూసి వారికి చెప్పి ఒప్పిస్తాను.
- వారు ఏదైనా మరచిన ఎడల నేను వారిని చాలా సున్నితమైన రీతిలో తెలియపరుస్తాను.
- వారు రాజీపడిన తరువాతే నిద్రిస్తాను. వారికి ముందు నిద్రించను.
- అప్పుడప్పుడు ప్రవక్త(స) గారి ఈ సద్వచనాన్ని వారి చెవిన వేస్తుంటాను. "నీ భార్యే నీ స్వర్గం, నీ భార్యే నీ నరకం".

# ఓ భర్తగా నేను

- అబుల్ హసన్

- జీవితపు అన్ని ఘడియల్లో నేను ఆమెను సుఖ పెడతాను.
- ఆమె లోపాలని పదేపదే ఎత్తి చూపను. దుస్తుల్లో వంటకాల్లో, మాటల్లో ఉన్న లోపాలను అప్పటికప్పుడు వేలెత్తి చూపను. మరొకరితోనూ చెప్పుకోను.
- అప్పుడప్పుడు ఆమె కోసం **Gift** కొని, దాచి - కాసేపు గిల్లికజ్జాలు పెట్టుకున్న తరువాత ఇస్తాను.
- ఆమె నాకు **Gift** ఇచ్చినప్పుడు ఆమెను నేను ఎంతగానో మెచ్చుకుంటాను.
- ఆమె నాతో ఏదైనా చెప్పదలిస్తే నేను ఆమెను ప్రోత్సహిస్తాను. నేను ఆమెకు ఏదైనా సలహా ఇవ్వాలనుకుంటే ఆమె భావోద్దేశాలను దృష్టిలో ఉంచుకుంటాను. పొలం విషయంలోనైనా, వంట విషయంలోనైనా గుడ్డలు కుట్టే కుట్టించే విషయంలోనైనా, అవసరమనిపిస్తే వెనకడుగు వెయ్యను. నా వల్ల కాదు, కూడదు అని సాకులు చెప్పను.
- కొన్ని సందర్భాల్లో ఆమె పట్ల నా ప్రేమని ఎక్కువ ప్రదర్శిస్తాను. ముఖ్యంగా బహిష్టు సమయంలో, గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసవించినప్పుడు.
- నేను ఆమెతో ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించను. ఆమె ఓ స్త్రీ అనీ, స్త్రీ గాజులాంటిదని సదా దృష్టిలో ఉంచుకుంటాను. ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "వారు (స్త్రీలు) గాజుల్లా నాజుకైన వారు. వారితో మృదువుగా ప్రవర్తించండి".
- అప్పుడప్పుడు ఆమెకు ఇష్టమైన వస్తువులు నాకు ఇష్టం లేకపోయినా తెచ్చిస్తాను.
- నేను ఆమెను మంచి పేరుతో పిలుస్తాను. ప్రవక్త(స) మన అమ్మగారైన ఆయిషా(ర) ని ప్రేమతో 'ఆయిష్' అని పిలిచేవారు కదా!
- ఆమె నా కోసం శ్రమించినప్పుడల్లా, నేను ఆమెపై ప్రశంసావర్షం కురిపిస్తాను.
- నేను ఇంట్లో అడుగుపెట్టాక బయటి విషయం గురించి ఆలోచించను. నేను ఆమెకు తోడుగా ఉంటూ, రోజూ అవసరమయిన వాటి గురించి చర్చిస్తాను.
- దీనీ ఇజ్తెమాలలో, సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొనమని ఆమెకు చెబుతూ ఉంటాను.








# నెలవంక ఉత్తరాలు

## నా జీవితాన్ని మార్చిన నెలవంక

గౌరవనీయులైన నెలవంక సంపాదకుల వారికి. అస్సలాము అలైకుమ్. వరహ్మతుల్లాహి వబరకాతుహ్... నా పేరు చిన్ని బాబు. నేను ఇస్లాం స్వీకరించిన తరువాత నా పేరు "అబ్దుర్రహీమ్" గా మార్చబడింది. దీనికి నేను చాలా సంతోషిస్తున్నాను. నేను కువైట్ కి వచ్చి 11 నెలలు అయింది. ఇస్లాం స్వీకరించి 8 నెలలు మాత్రమే అయింది. 2008 మార్చి నెలలో నెలవంక చదివి నేను ఇస్లాం స్వీకరించాను. అందులో అజీజుర్రహ్మాన్ గారు వ్రాసిన 'రిటర్న్ టికెట్' నా మనస్సును మార్చివేసింది. నన్ను ఒక్క సారిగా ఆలోచనలోనికి నెట్టేసింది. ఆ తరువాత ఏప్రిల్‌లో నేను పూర్తిగా ఇస్లాంలో ప్రవేశించాను. నాకు దగ్గరలో ఉన్న IPC లో ధార్మిక శిక్షణ గరుపుతున్నాను.

అప్పటి నుండి నా జీవితం మారిపోయింది. నా గమ్యస్థానం ఎక్కడికి? నేను ప్రయాణించే యాత్ర ముగిసిపోయాక నేను చేరవలసిన స్థలం ఏది? అని ఆలోచించాను. దీనికి కారణం నెలవంక పత్రిక. ఈ పత్రిక నా మనస్సును మార్చింది. అందుకుగాను నెలవంక పత్రికావర్గానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నాను.

నెలవంక పత్రిక ఉన్న ప్రతీదీ మనస్సు పెట్టి చదివితే మనిషి జీవితానికి అర్థం తెలుస్తుంది. ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను తెలియజేస్తుంది. సీరత్ క్విజ్ కూడా చాలా బాగుంది. సీరత్ క్విజ్ వ్రాస్తున్న షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి గారికి కృతజ్ఞతలు.

ఈ నెలవంక ద్వారా నా మనస్సు మార్చి నిజ దైవం వైపునకు నడిపించిన ఈ పత్రికా వర్గమంతటికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ఈ నెలవంక ను మార్గభ్రష్టులుగా ఉన్న ప్రతి ఒక్కరు చదవాలి. చదివిన తరువాత మారాలి. ఇస్లాం స్వీకరించాలి, నిజ దైవం వైపుకు మరలాలి అని నిండు హృదయంతో కోరుకుంటున్నాను.

– అబ్దుర్రహీమ్
(జాబిర్ అలీ)

## ప్లీజ్, మా అక్క కోసం ప్రార్థించండి

నెలవంక సంపాదకులకు,

నెలవంక IPC ని తొంగిచూడని తొలి రోజుల్లో ...నా సోదరి ఇక్కడ వచ్చిన మొదటి రోజుల్లో... ఇస్లాం ధర్మం గూర్చి తెలుసుకోవడానికి పుస్తకాలు చదువు అని పదేపదే చెప్పేదాన్ని. కానీ ఆమెకు బుక్స్ చదివే అలవాటు లేదు. చదవలేదు. తరువాత 'నెలవంక' వచ్చేసింది. అందులోనూ నవ ముస్లింల వ్యాసాలు, నెలవంకపై ఉత్తరాలు సరళ భాషలో రావడం ఆమె మనసును ఆకట్టుకుంది. నెలవంక రాగానే నా కంటే ముందే చదవటం ప్రారంభించింది. అంతే కాదు, అల్‌హమ్దులిల్లాహ్ బహుదైవారాధన తప్పు అని, సృష్టికర్త ఒక్కడే అని ఆమె సూత్రప్రాయంగా అంగీకరించింది. అయితే క్రియాత్మకంగా తన కుటుంబ సభ్యుల భయంతో ముస్లిం కాకపోయినా అంతరాత్మ అంగీకరించింది. ఆమెలో ఉన్న ఆ భయాన్ని తొలగించి కుటుంబ సమేతంగా ముస్లిం కావాలని మీరందరూ కూడా అల్లాహ్‌ని అర్థించాలని కోరుకుంటున్నాను.

–మర్యమ్ (జానకి)
రౌధా

## మేము ధన్యులము

అల్‌హమ్దులిల్లాహ్ మేము ఇస్లాం స్వీకరించిన తరువాత మా జీవితంలో ఎన్నో మార్పులు సంభవించాయి. 5 పూటలూ నమాజు చేసి, మనశ్శాంతి పొంది, మంచి మార్గములో నడుచుకొనుట మేము నేర్చుకుంటున్నాము. ఇస్లాం స్వీకరించిన తర్వాత IPC వారి ఆధ్వర్యంలో మొదట ఉమ్రా చేశాము. తర్వాత ఇప్పుడు వారి ఆధ్వర్యంలోనే హజ్ కూడా చేశాము. మనస్సు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంది. ఈ హజ్ యాత్ర ద్వారా మా జీవితం ధన్యమయింది. మా పాపాలు అన్నీ కడిగి వేయబడతాయని ఆశిస్తున్నాము. దీంతో పాటు నెలవంక పుస్తకము ద్వారా మాకు తెలియని ఎన్నో విషయములు తెలిసాయి. ఏ అనుమానాలు ఉన్నా అన్నింటికీ జవాబులు ఈ నెలవంక పుస్తకం ద్వారా తెలుసుకుంటూ, ఇస్లాం యొక్క గొప్పతనాన్ని చాటుతూ వున్నాము. నెలవంక ద్వారా వారికి ఇంకా చాలా మందిలో ఇస్లాం పట్ల ఉన్న అపోహలు తొలగిపోగలవు.

– అహ్మద్ (యోగమూర్తి)

## త్యాగోత్సవ సందేశం

పండుగరోజు ఖుర్బానీ సందేశాన్ని క్లుప్తంగా తెలుగులో అబ్దుస్సలాం గారు వివరించారు. అల్లాహ్ వాక్కును పాటించే తండ్రి, తండ్రి వాక్కును పాటించే కుమారుడు, ఒకరిలో ప్రేమ మరొకరిలో త్యాగం ఈ సందర్భంలో తెలుస్తాయి.

ఇబ్రీదులోని ఇంత మర్మాన్ని ఇన్ని సంవత్సరాలుగా తెలియని నాకు ఇప్పుడు క్లుప్తంగా అర్థమయ్యే విధానంలో తెలియ పరచిన అబ్దుస్సలాం గారికి కృతజ్ఞతలు.

– బి. సమీర్
(కువైట్ సిటీ)

# వివేచన

## మీరు విజయాన్ని కాంక్షించేవారే అయితే....

ఈ మార్గంలో....
మీ లక్ష్యాన్ని నీరుగార్చే కపట స్నేహితులు, శ్రేయం కోరే ప్రత్యర్థులు తారసపడతారు–
అయినా...
విజయం వైపునకే దృష్టి సారించండి.

హజ్రత్ హుజైఫా (ర.జి) కథనం–

**ప్రవక్త మహనీయుల వారు (స) ఇలా చెప్పారు:**

“మీరు ‘ఇమ్అ’ కావద్దు. ప్రజలు మీకు మేలు చేస్తే మీరు వారికి మేలు చేస్తామని, దౌర్జన్యం చేస్తే మీరు దౌర్జన్యం చేస్తామని అనకండి. మనో నిగ్రహం కలిగి ఉండండి. (మీ మనసుని మంచిపైనే కేంద్రీకరించండి). ఇతరులు మేలు చేస్తే మీరు మేలు చేయండి. దౌర్జన్యానికి పాల్పడితే మీరు మాత్రం దుర్మార్గానికి ఒడిగట్టకండి”. (తిర్మిజీ)





# రక్త కన్నీరు!

మమ్ము మరువకండి !
మేము దిగ్బంధంలో ఉన్నాము
అలుముకున్న  చీకటిలో...
ఆకలితో అలమటిస్తున్నాము...

మమ్ము మరువకండి !
గుక్కెడు తన్నీరు కోసం...
గుప్పెడు మెతుకుల కోసం...
గంపెడాశతో ఎదురు చూస్తున్నాం

మమ్ము మరువకండి !
మా పసికందులు అనుదినం
తనువు చాలిస్తున్నారు
వికసించే మా లేతబుగ్గలు
బుల్డోజర్ల క్రింద నలిగిపోతున్నారు

మమ్ము మరువకండి !
నలుదిక్కుల నుంచీ ముట్టడి
ఎటు చూసినా మృత్యువే
ఎక్కడ విన్నా మరణ రోదనలే
ఎక్కడికని వెళ్లాలి?
తరం తరం...నిరంతరం...
భయాందోళనల బ్రతుకాయే!

ఓ ప్రజాస్వామ్య ధ్వజవాహకుల్లారా!
మాజీలో 'మారణ హోమానికి' ఆహుతి అయిన వారలారా!
ఇప్పుడు మీరూ అదే మారణహోమం  సృష్టిస్తారా!
మా దేశంలో మాకే నిలువ నీడ లేకుండా చేస్తారా!
మీరు సాగించే ఈ నరమేధయాగం
మానవతకే ఓ కళంకం కాదా!

సభ్య సమాజ సభ్యులారా!
మమ్ము మరువకండి
నెత్తుటి మడుగుల్లో తడిసి ఉన్న
గాజా ముద్దు బిడ్డలను కనీసం
మీ ప్రార్థనల్లో గుర్తుంచుకోండి
ప్లీజ్...మా కోసం ప్రార్థించండి
'గాజా' కు ఎంతో అవసరం
మీ సానుభూతి గళం!